వాడపల్లికి పోటెత్తిన భక్తులు 7

సెమీస్ వన్‌సైడ్!

» కాకినాడలో కొనసాగుతున్న జాతీయ మహిళా జూనియర్ హాకీ పోటీలు 7

రెండో దశ వర్క్‌ఫ్రం హోమ్

సర్వే ప్రారంభం



అమలాపురం మండలం కామనగరువులో వర్క్‌ఫ్రమ్ హోం సర్వే నిర్వహిస్తున్న సచివాలయ కార్యదర్శి సూరపరాజు తదితరులు

- సచివాలయాలకు చేరిన నిరుద్యోగుల జాబితాలు
- సిద్ధంగా ఉన్నవారి సమగ్ర సమాచారం సేకరణ
- ఇంటర్నెట్ సదుపాయంపై ఆరా

అమలాపురం రూరల్, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం రెండో దశ వర్క్ ఫ్రమ్ హోం సర్వే చేపట్టడంతో నిరుద్యోగుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. ఈఏడాది మార్చి నెలలో తొలి విడత వర్క్ ఫ్రం హోమ్ సర్వేను ప్రభుత్వం సచివాలయాలవారీగా చేపట్టి సమగ్ర వివరాలను సేకరించింది. అప్పట్లో వర్క్ ఫ్రం హోమ్‌కు సచివాలయాల వారీగా వందలాది మంది ఆమోదం తెలిపారు. ఈ సర్వేలో ఐటీఐ, డిగ్రీ, డిప్లమో, పీజీ, ఇంజనీరింగ్ వంటి ఉన్నత చదువులు చదివిన వారి వివరాలు సైతం సేకరించారు. నిరుద్యోగ యువతకు ఇంటివద్ద నుంచే ఉద్యోగ అవకాశాలు కల్పించే అవకాశం ఉందని అధికారులు చెప్తున్నారు. ప్రభుత్వం ప్రస్తుతం సర్వేకు సంబంధించిన వివరాలను మాత్రమే ప్రకటించిందని, త్వరలోనే పూర్తి వివరాలను ప్రకటించే అవకాశం ఉందని అధికారులు చెప్తున్నారు.

4.21లక్షల గృహాల్లో సర్వే పూర్తి

వర్క్ ఫ్రం హోమ్ సర్వేలో భాగంగా జిల్లాలో తొలివిడత 4,21,091 గృహాల్లో చదువుకున్న 9,21,625మందిని సర్వే చేశారు. వారి విద్యార్హతలను బట్టి వర్క్ ఫ్రం హోమ్ కింద ఏ తరహా ఉద్యోగాలు, పనులు చేయాలనుకుంటున్నారో నమోదు చేశారు. విద్యార్హతలను బట్టి వారు ఏవిధమైన శిక్షణ కోరకుంటున్నారు. ఏ తరహా ఉద్యోగాలు చేయాలనుకుంటున్నారో నమోదు చేశారు. వర్క్ ఫ్రం హోమ్‌కు సిద్ధపడిన వారి పూర్తి సమాచారం ప్రభుత్వం జిల్లాలవారీగా సేకరించింది.

1.17లక్షల మంది సిద్ధం

తొలి విడతలో నిర్వహించిన వర్క్ ఫ్రం హోమ్ సర్వే కింద ఉద్యోగాలు చేసేందుకు జిల్లాలో 1,17,554 మంది నిరుద్యోగులు తమ ఆమోదాన్ని తెలిపారు. దీంతో సచివాలయాల వారీగా వారి వివరాలతో రాష్ట్ర ప్రభుత్వం జాబితాలను సిద్ధం చేసి ఇప్పటికే ఆయా సచివాలయాలకు పంపించింది. దీంతో జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాలతో సచివాలయ సిబ్బంది ఇప్పటికే రెండో దశ సర్వే చేపట్టారు. అమలాపురం, మండపేట, రామచంద్రపురం పట్టణాలతోపాటుముమ్మిడివరం నగర పంచాయతీ,జిల్లాలోని అన్ని మండలాల్లో ఈ సర్వేను ప్రారంభించారు. ఇప్పటివరకు జిల్లాలో 12,495 మందికి రెండోదశ సర్వే పూర్తిచేశారు. 1,05,059మందిని ఇంకా చేయాల్సి ఉంది. సత్వరం సర్వేను పూర్తిచేసేలా సచివాలయ ఉద్యోగులను ఆదేశించారు.

ఐటీ సెక్టార్‌పై ప్రధానంగా దృష్టి

ఐటీ సెక్టార్‌లో వర్క్ ఫ్రం హోమ్ కింద ఏ తరహా ఉద్యోగాలు చేయాలనుకుంటున్నారు. వారి ఇంటికి బ్రాడ్‌బ్యాండ్ కనెక్టివిటీ ఉందా.. లేదా, దాని స్పీడు ఎంత తదితర వివరాలను నమోదు చేస్తున్నారు. వర్క్ ఫ్రం హోమ్ ఉద్యోగం చేసుకోవడానికి ఇంట్లో ప్రత్యేక గది ఉందా.. ఉంటే ఆ గదిలో మరికొందరికి పనిచేసుకునే చోటు ఉందా కూడా చూస్తున్నారు. దీంతో ఇంజనీరింగ్ విద్యను పూర్తి చేసుకున్న వారు ప్రభుత్వం కల్పించే ఉద్యోగ సదుపాయం కోసం ఆశపడుతున్నారు.

రెండో దశ సర్వే జరిగేది ఇలా..

సచివాలయాల వారీగా అందిన నిరుద్యోగుల జాబితాలతో సిబ్బంది రెండో దశ సర్వే ప్రారంభించారు. వర్క్ ఫ్రం హోమ్‌కు సిద్ధపడిన నిరుద్యోగుల సమగ్ర వివరాలను నమోదు చేసుకుంటున్నారు. వారు ఎక్కడ చదువుకున్నారు, తెలిసిన భాషలు ఎన్ని, విద్యార్హతలు, స్పెషలైజేషన్ చేశారా, వచ్చినమార్కులు, ఎప్పుడు ఉత్తీర్ణులయ్యారు.. వంటి వివరాలను సచివాలయ సిబ్బంది ఆన్‌లైన్‌లో నమోదు చేసుకుంటున్నారు. వారివిద్యార్హతల ఒరిజినల్ సర్టిఫికెట్లు అప్‌లోడ్‌చేస్తున్నారు. అన్ని ప్రక్రియలు పూర్తి చేసిన తర్వాత ఆధార్, మొబైల్, ఈ-మెయిల్, ఓటీపీలను నమోదు చేస్తున్నారు. ప్రభుత్వం వర్క్‌ఫ్రంహోమ్ సర్వే ను పూర్తిచేసి తమ జీవితాల్లో వెలుగులు నింపుతుందని నిరుద్యోగులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఏళ్ల తరబడి ఉద్యోగావకాశాలు లేని వారి పాలిట ఈ సర్వే కొత్త ఆశలను చిగురింప చేస్తోంది.



ప్రతిపాదనలతో సరి.. నిర్మాణం ఎప్పుడో మరి?

పాయ దాటాలంటే ఇలా పంటు ఎక్కాల్సిందే

ఇద్దరు ముఖ్యమంత్రులు శంకుస్థాపన చేసిన ప్రాజెక్టు అది. అయినా కార్యరూపం దాల్చలేదు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ.. హామీగానే మిగిలింది. ఐ.పోలవరం మండలంలోని గోగుల్లంక వారధి నిర్మాణం పరిస్థితి ఇది.

- నెరవేరని ఎన్నికల హామీ
- కార్యరూపం దాల్చని గోగుల్లంక వారధి నిర్మాణం

ఐ.పోలవరం, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): బాహ్య ప్రపంచానికి దూరంగా ఏళ్ల తరబడి కాలం వెళ్లదీస్తున్న రెండు గ్రామాలకు చెందిన ప్రజల ఆవేదన వర్ణనాతీతం. ఐ.పోలవరం మండలం గుత్తెనదీవి, గోగుల్లంక గ్రామాలను కలుపుతూ వృద్ధ గౌతమీ గోదావరిపై వంతెన నిర్మించాలని రెండు గ్రామాల ప్రజలు ప్రజాప్రతినిధులకు మొరపెట్టుకుంటూనే ఉన్నారు. అయినా వారధి నిర్మాణం ప్రతిపాదనలకే పరిమితమైంది తప్ప లంకవాసుల కల మాత్రం నెరవేరలేదు. నిధుల విడుదలలో జాప్యంవల్ల వంతెన నిర్మాణ అంచనా వ్యయం రెట్టింపు స్థాయిలో పెరుగుతూనే వచ్చింది.

ఫైనాన్స్ క్లియరెన్స్ జరగక..

గతంలో ముఖ్య మంత్రులుగా ఉన్న వైఎస్ రాజశేఖరరెడ్డి, జగన్ వంతెన నిర్మాణానికి వేర్వేరు ప్రాంతాల్లో శంకుస్థాపనలు చేశారు. రాజశేఖరరెడ్డి హయాంలో రూ.24.50 కోట్ల అంచనా వ్యయం.. తర్వాత రూ.44.50కోట్లకు చేరింది. నిధుల మంజూరులో జాప్యం కారణంగా అంచనా వ్యయం పెరిగిపోతూనే ఉంది. ప్రస్తుత ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు వంతెన నిర్మాణానికి రూ.44.50కోట్లతో ప్రతిపాదనలు పంపారు. పరిపాలనాపరమైన ఆమోదం లభించినప్పటికీ ఫైనాన్స్ క్లియరెన్స్ కోసం ఎమ్మెల్యే ప్రయత్నిస్తున్నారు. ఎట్టి పరిస్థితిల్లోను తన హయాంలో గోగుల్లంక వంతెన నిర్మించి లంకవాసుల కల నెరవేర్చాలన్న పట్టుదలతో ఆయన కృషి చేస్తున్నారు. గుత్తెనదీవి-గోగుల్లంకల మధ్య గోదావరి నదిపై 300మీటర్ల పొడవున వంతెననిర్మాణం చేపట్టనున్నారు. గోగుల్లంక, భైరవలంక గ్రామాలకు చెందిన 2500 మంది గోదావరి పాయదాటి రాకపోకలు సాగిస్తున్నారు. వరదలు, తుపాన్లు, భారీవర్షాల సమయంలో గోదావరి దాటేందుకు లంకవాసులు అష్టకష్టాలు పడుతున్నారు. ఉద్యోగులు, విద్యార్థులు, రైతులు భయం గుప్పెట్లో ప్రయాణాలు సాగిస్తున్నారు. రెండుగ్రామాల పరిధిలో 5000 ఎకరాల పైబడి వ్యవసాయ భూముల తోపాటు ఆక్వా చెరువులున్నాయి. వీటికిసంబంధించిన మెటీరియల్, వ్యవసాయ ఉత్పత్తులను ఇంజన్ పడవల ద్వారానే తరలిస్తున్నారు. ప్రజాప్రతినిధులు స్పందించి వంతెన నిర్మాణంపై దృష్టిసారించాలని ప్రజలు కోరుతున్నారు.

వంతెన కల నెరవేర్చాలి

-లంకే అప్పన్న, గోగుల్లంక



ప్రభుత్వాలు మారుతున్నా మాకు వంతెన నిర్మాణం మాత్రం పూర్తికావడం లేదు. ఎన్నికల సమయంలో నాయకులు హామీలు గుప్పిస్తున్నారు. ఇప్పటికీ పడవలు, పంటులపై రాకపోకలు సాగిస్తున్నాం. వరదల సమయంలో బయటకు వెళ్లాలంటే వణుకు పడుతోంది. ప్రజాప్రతినిధులు స్పందించి వంతెన నిర్మాణం పూర్తయ్యేలా చూడాలి.

వారధి లేక ఇబ్బందులు

-తిరుకోటి లక్ష్మణస్వామి, భైరవలంక



గోగుల్లంక, భైరవలంక ప్రజలు బయటకు వెళ్లాలంటే గోదావరిపాయదాటాలి. రాత్రి సమయంలో చాలా ఇబ్బందులు పడుతున్నాం. ఇల్లు నిర్మించుకోవాలంటే మెటీరియల్ తెచ్చుకునేందుకు రవాణా చార్జీలు భరించలేకపోతున్నాం. వంతెన నిర్మాణం పూర్తయితే చాలా ఆనందిస్తాం. త్వరితగతిన వంతెన నిర్మాణం జరగాలని కోరుతున్నాం.

ప్రతి మంగళవారం..

ఫైలేరియా నైట్ క్లినిక్

» హెల్త్ ఇన్‌స్పెక్టర్ ప్రసాదరావు

అమలాపురం,ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): జాతీయ కీటక జనిత వ్యాధుల నివారణా కార్యక్రమంలో భాగంగా ఫైలేరియా వ్యాధి ప్రబలకుండా ఉండేందుకు అమలాపురం పురపాలక సంఘ పరిధిలోని ఏవీఆర్ నగర్‌లోని ఫైలేరియా కార్యాలయంలో ప్రతి మంగళవారం సాయంత్రం 6గంటల నుంచి రాత్రి 10గంటల వరకు నైట్ క్లినిక్ నిర్వహిస్తున్నట్లు హెల్త్ ఇన్‌స్పెక్టర్ పి.ప్రసాదరావు తెలిపారు. ఫైలేరియా వ్యాధి సూక్ష్మ క్రిమి ద్వారా వ్యాపిస్తుందని, ఈ వ్యాధి కాళ్లు, చేతులకే కాకుండా ఆడవారి రొమ్ము భాగానికి, మగవారి పురుషాంగానికి కూడా వ్యాపించే అవకాశం ఉందన్నారు. ఫైలేరియా వ్యాధి అనుమానితులు ప్రతిమంగళవారం జరిగే నైట్‌క్లినిక్‌ను సద్వినియోగం చేసుకుని అందించే మందులు తీసుకోవాలన్నారు. గనిశెట్టి వెంకటరమణలాల్, సూర్యప్రకాశరావు, సీహెచ్ ప్రసాద్ ఉన్నారు.

నేడు వెయిట్ లిఫ్టింగ్ టీం ఎంపికలు

అమలాపురం టౌన్, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని స్పోర్ట్స్ అథారిటీ నిర్వహిస్తున్న వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు సంబంధించి జిల్లా క్రీడాకారుల ఎంపిక అమలాపురంలో నిర్వహిస్తున్నట్టు జిల్లా స్పోర్ట్స్ డెవలెప్మెంట్ ఆఫీసర్ పీఎస్ సురేష్‌కుమార్ తెలిపారు. అమలాపురం హెల్త్‌అండ్ ఫిట్‌నెస్ జిమ్‌లో సోమవారం ఉదయం 9గంటలనుంచి జిల్లా వెయిట్ లిఫ్టింగ్ టీం ఎంపిక జరుగుతుందన్నారు.అండర్-22 వయసు గల స్త్రీ, పురుషులు ఈ ఎంపికలో పాల్గొనవచ్చని, పుట్టినతేదీ ధ్రువీకరణ పత్రంతోపాటు ఆధార్‌కార్డు, రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలతో సంప్రదించాలని కోరారు.

శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానం

ధర్మకర్తల నియామకానికి నోటిఫికేషన్



అంతర్వేది, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): నవ నారసింహ క్షేత్రాల్లో ఒకటైన అంతర్వేది శ్రీ లక్ష్మీనరసింహ స్వామి దేవస్థాన ధర్మకర్తల నియామకానికి దరఖాస్తులు కోరుతున్నట్టు ఆలయ సహాయ కమిషనర్ ఎంకేటీఎన్వీ ప్రసాద్ తెలిపారు. ఈనెల 8న ప్రభుత్వం, దేవదాయశాఖ ఉత్తర్వులు జారీ చేసిందని, ఆసక్తి గలవారు 20రోజుల్లో దేవదాయ,ధర్మదాయశాఖలో నిర్ణయించిన ప్రొఫార్మ-2 ప్రకారం దరఖాస్తులు కోరుతున్నామని ఏసీ ప్రసాద్ తెలిపారు. ఇప్పటికే రాజోలు నియోజకవర్గంలో ఆశావహుల్లో చర్చలు జరుగుతున్నాయని, కూటమి నాయకులు స్థానికులు ధర్మకర్తల నియామక దరఖాస్తులకోసం ఎదురుచూస్తున్నారు.

బాలబాలాజీ ధర్మకర్తల మండలి నియామకానికి కూడా..

మామిడికుదురు, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): అప్పనపల్లి బాలబాలాజీ దేవస్థానం ధర్మకర్తల మండలి నియామకానికి నోటిఫికేషన్ జారీ అయిందని సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ తెలిపారు. ఆసక్తిగలవారు నోటిఫికేషన్ విడుదల సమయంనుంచి 20రోజుల్లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు దేవస్థానం కార్యాలయం వద్ద ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కార్యాలయ పనివేళల్లో సంప్రదించాలని తెలియచేశారు.

ఉపాధ్యాయులకు బోధనేతర పనుల నుంచి విముక్తి కల్పించాలి: మాజీ ఎమ్మెల్సీ ఐవీ



అమలాపురంలో యూటీఎఫ్ పతాకాన్ని ఆవిష్కరించిన ఐవీ

అమలాపురంటౌన్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులను బోధనేతర పనుల నుంచి విముక్తి కల్పించాలని మాజీ ఎమ్మెల్సీ యిళ్ల వెంకటేశ్వరరావు ఐవీ డిమాండ్ చేశారు. విద్యారంగంలో ప్రభుత్వం చేపడుతున్న చర్యలు విద్యను ప్రైవేటీకరణ చేసేదిశగా నడుస్తున్నాయని ఆయన విమర్శించారు. ఉపాధ్యాయులకు యాప్‌ల భారం పెరిగి విద్యార్థులకు పూర్తిస్థాయిలో చదువులు చెప్పి న్యాయం చేయలేని పరిస్థితి ప్రభుత్వమే కల్పిస్తోందని ధ్వజమెత్తారు. ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ 52వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆదివారం అమలాపురం ఎంప్లాయీస్ హోంలో నిర్వహించారు.తొలుత యూటీఎఫ్ పతాకాన్ని మాజీ ఎమ్మెల్సీ ఐవీ ఆవిష్కరించి మాట్లాడారు. జిల్లా సహఅధ్యక్షుడు జీవీ రమణ, గౌరవాధ్యక్షుడు పెంకే వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలపై నిరంతరం పోరాడడమే కాకుండా విద్యాభివృద్ధికి యూటీఎఫ్ కృషిచేస్తోందన్నారు. జిల్లా కార్యదర్శులు పెన్నాడ శ్రీనివాస్, టీ.దుర్గాప్రసాద్, కె.శ్రీనివాస్, బి.చంద్రకళ, డి.శ్రీరామమూర్తి, జీవీ గోపాలకృష్ణ, ఎం.వెంకటేశ్వరరావు, పలువురు మండలశాఖ ప్రతినిధులు పాల్గొన్నారు.



హౌ..ష్!

పేదల కొంప ముంచిన వైసీపీ

స్పందించని కేంద్రం



లబ్ధిదారుల జాబితాను కేంద్ర ప్రభుత్వ హౌసింగ్ వెబ్‌సైట్‌లో పట్టణం, గ్రామీణ ప్రాం తం విభాగంలో అప్‌లోడ్ చేయాలి. లబ్ధిదారుడి ఫొటోలతో సహా అప్‌లోడ్ చేస్తే అర్హత సాధించిన ఒక్కో లబ్ధిదారుడి ఇంటి నిర్మాణానికి కేంద్రం రూ.1.50 లక్షలు,రాష్ట్ర ప్రభుత్వం రూ.లక్ష మంజూరు చేయాలి. ఇక్కడే అసలు చిక్కు మొదలైంది. రాష్ట్ర ప్రభుత్వం తరఫున లబ్ధిదారులకు రూ.లక్ష చొప్పున ఇవ్వడానికి ఏ ఇబ్బందీ లేకపోయినా కేంద్రం నుంచే సమస్య తలెత్తింది. ఉమ్మడి జిల్లాలో ఎంపిక చేసిన లబ్ధిదారుల వివరాలు అధికారులు కేంద్ర ప్రభుత్వ వెబ్‌సైట్‌లో నమోదు చేయాలి. ఇలా చేయాలంటే గ్రామాల వారీగా ప్రత్యేకంగా కేటాయించిన లాగిన్‌లను ఉపయోగించి పథకానికి అర్హత సాధించిన వారి వివరాలు అప్‌లోడ్ చేస్తారు. కానీ ఇప్పటి వరకు కేంద్రం అసలు లాగిన్‌లే ఇవ్వలేదు.దీంతో ఎంపికైన లబ్ధిదారుల వివరాలు జిల్లా అధికారుల వద్దే ఉండిపోయాయి.కాకినాడ జిల్లాలో 326 గ్రామాలకు లాగిన్లు ఇవ్వాల్సి ఉంటే ఇప్పటి వరకు 106 గ్రామాలకే లాగిన్‌లు ఇచ్చారు.వీటి ద్వారా లబ్ధిదారుల వివరాలు అప్‌లోడ్ చేస్తే కేవలం 1800 దరఖాస్తులు మాత్రమే కేంద్ర వెబ్‌సైట్ స్వీకరించింది. కోనసీమ జిల్లాలో 286 గ్రామాలకు 47 గ్రామాలకే లాగిన్‌లు ఇవ్వగా దరఖాస్తులను అప్‌లోడ్ చేస్తుంటే స్వీకరించడం లేదు. తూర్పుగోదావరి జిల్లాలో 303 గ్రామాలు ఉంటే 55 గ్రామాలకు కూడా లాగిన్‌లు కేటాయించలేదు. దీంతో లబ్ధి దారులకు ఇప్పట్లో కేంద్రం నుంచి ఇళ్ల నిర్మాణ అనుమతులు వచ్చేలా కనిపించడం లేదు.

- పీఎంఏవైకు ఎదురుచూపులు
- దరఖాస్తులు చేసి 8 నెలలు
- ఇంకనూ రాని అనుమతులు
- 44,700 మంది దరఖాస్తు
- గృహనిర్మాణ శాఖ సర్వే పూర్తి
- 95 శాతం అర్హులుగా గుర్తింపు
- నమోదు కాని వివరాలు
- లాగిన్‌లు కేటాయించని కేంద్రం

(కాకినాడ,ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి జిల్లాలో పేదల సొంతింటి కల సాకారం అవడం లేదు. దరఖాస్తు చేసి నెలలు గడుస్తున్నా అనుమతులు రావడం లేదు. ఒక పక్క వీరి అర్హతను ధ్రువీకరిస్తూ గృహ నిర్మాణ శాఖ పచ్చజెండా ఊపినా కేంద్రం అనుమతుల్లో తీవ్ర జాప్యం జరుగుతోంది. లబ్ధిదారుల జాబితా సిద్ధం చేసినా వెబ్‌సైట్‌లో నమోదు చేయడానికి కేంద్రం కావాల్సిన లాగిన్‌లు పూర్తిగా ఇవ్వడం లేదు. దీంతో సొంత స్థలం ఉండి ఇళ్లు నిర్మించుకోవాలనుకునే పేదలకు ప్రభుత్వ సాయం ఎప్పుడు అందుతుందో స్పష్టత లేదు. అధికారులేమో అర్హులైన లబ్ధిదారుల వివరాలు అప్‌లోడ్ చేస్తున్నా కేంద్రం ఆమోదం లేక తిరస్కారానికి గురవుతున్నాయి.గత వైసీపీ హయాంలో పేదల ఇళ్ల నిర్మాణం పేరుతో ఎడాపెడా లెక్కలు చూపడంతో అనుమానాలతో తాజా లబ్ధిదారులను కేంద్రం పరిగణనలోకి తీసుకోవడానికి సాంకేతిక ఇబ్బందులు అడ్డువస్తున్నాయని చెబుతున్నారు. దీంతో ఉమ్మడి జిల్లాలో 44,700 మంది పేదలు దీనంగా ఎదురుచూస్తున్నారు. కొందరైతే నిధులు విడుదల ఖాయమని భావించి పనులు చేసేసి బిల్లులు అందక లబోదిబోమంటున్నారు.


44,700 దరఖాస్తులు..

పేదల సొంతింటి కలను నెరవేర్చడానికి అధికారంలోకి వచ్చిన వెంటనే రాష్ట్ర ప్రభుత్వం సాయం ప్రకటించింది. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు సొంత స్థలం ఉన్న పేదలకు ఇళ్లు కట్టించి ఇస్తామన్న హామీని నెరవేర్చ డానికి దరఖాస్తులు స్వీకరించింది. ఈ మేరకు కేంద్రం,రాష్ట్రం కలిపి రూ.2.50 లక్షలు ఇస్తామని ప్రకటించింది.ఈ మేరకు సచివా లయాల ద్వారా గతేడాది నవంబరు ఆఖరు నుంచి దరఖాస్తులు స్వీకరించింది. ఇప్పటి వరకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 44,700 మం ది దరఖాస్తులు చేసుకున్నారు.అత్యధికంగా కాకినాడ జిల్లాలో 18,500 దరఖాస్తులు, తూర్పు గోదావరి జిల్లాలో 12,200, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 14 వేల దరఖాస్తులు వెల్లువెత్తాయి. జిల్లా గృహ నిర్మాణ శాఖ అధికారులు అర్హుల కోసం గ్రామాల వారీగా డిమాండ్ సర్వే నిర్వహించగా 95 శాతం మందికిపైగా అర్హత సాధించారు. వివిధ దశల వడపోత అనంతరం రాష్ట్ర ప్రభుత్వ గృహ నిర్మాణ శాఖ లబ్ధిదారుల యాప్‌లో వివరాలు నమోదు చేశారు.



గాలి లెక్కలతో అస్తవ్యస్తం

కేంద్రం పీఎం ఆవాస్ యోజన 2.0 కింద ఉమ్మడి జిల్లాలో సొంత స్థలం ఉన్న పేదలకు ఇంటి నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలి. కేంద్రం లాగిన్‌లలో లబ్ధిదారుల వివరాలు అప్‌లోడ్ చేస్తేనే ఇది సాధ్యం. కేంద్రం లాగిన్‌లు ఇవ్వకపోవడానికి గత వైసీపీ హయాంలో జరిగిన అడ్డదిడ్డ నిర్ణయాలే కారణమని అధికారులు చెబుతున్నారు. అప్పట్లో గొప్పల కోసం కట్టని ఇళ్లను సైతం జగనన్న ఇళ్ల కాలనీల పేరుతో కేంద్రానికి దొంగ లెక్కలు చూపించేశారు. తద్వారా నిధులు రాబట్టేశారు.ఎక్కడో ఊరి చివర, శ్మశానాల వద్ద ఖాళీ స్థలాల్లో పేదలకు భూములిచ్చారు. ఇవన్నీ ముంపు ప్రాంతాలు, ఊళ్లకు దూరంగా ఉండడంతో లబ్ధిదారులు అసలు ఇళ్లు కట్టలేదు. ఇవి పూర్తకపోవడంతో కేంద్రం సీరియస్‌గా ఉంది.ఈ నేపథ్యంలో తాజా లబ్ధిదారులకు చిక్కులు తలెత్తాయి. పాతవి పూర్తికాకపోవడం,నిధులు లాగేయడంతో ఇప్పుడు కేంద్రం కొత్త లబ్ధిదారులను పరిగణనలోకి తీసుకోకుండా లాగిన్‌లు ఇవ్వడం మానేసింది. అప్పటి జగన్ ప్రభుత్వ నిర్వాకం ఇప్పుడు అసలు సిసలు పేదల కొంపముంచింది. డిమాండ్ సర్వే పూర్తవడంతో పథకానికి అర్హత వచ్చేసిందన్న ధీమాతో ఉమ్మడి జిల్లాలో ప్రస్తుతం అనేకమంది పేదలు పునాదులు,శ్లాబ్‌స్థాయి వరకు నిర్మాణాలు చేసేశారు.తీరా బిల్లులు కాదుకదా..కేంద్రం లాగిన్‌లు ఇవ్వకపోవడంతో తలలుపట్టుకుంటున్నారు.



నిమ్మ రైతు.. కంటి చెమ్మ!

- అమాంతం పడిపోయిన మార్కెట్
- కిలో రూ.20 నుంచి రూ.25
- గిట్టుబాటు కాక ఆందోళన
- లబోదిబోమంటున్న రైతులు

గోపాలపురం, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): గిట్టుబాటు ధరలేక నిమ్మరైతుల కళ్లు చెమ్మగిల్లుతున్నాయి. పెట్టుబడితో పాటు శ్రమకు తగిన ఫలితం లేకపోవడంతో నిమ్మకాయలు చెట్ల నుంచి కోయడానికి కూడా రైతు అడుగు ముందుకు వెయలేకపోతున్నాడు. ఆశించిన ధర దక్కకపోవడానికి ధరలు తగ్గుదలే ప్రధాన కారణమని నిమ్మరైతులు చెబుతున్నారు. ఏళ్ల కొద్దీ తోటలు పెంచి పూతసమయంలో వర్షాలు కురవడం, పూత రాలిపోవడం వంటి పరిణామాలు నిమ్మ రైతులపై ప్రభావం చూపుతున్నాయి. వేసవిలో ధరలు గరిష్ఠంగా పెరగడంతో దిగుబడి లేక రైతులు ఆశించిన స్థాయిలో నిమ్మకాయలు ఉత్పత్తి చేయలేకపోయారు. ప్రస్తుతం దిగుబడి అధికంగా ఉన్నప్పటికి ధరలు పడిపోవడంతో నిమ్మరైతుకు అనాసక్తి కలుగుతుంది. ఈ ఏడాది వేసవిలో కిలో నిమ్మ ధర గరిష్ఠంగా రూ.70 - రూ.80ల వరకు పెరిగింది. రైతుకు ఆశించిన స్థాయిలో ధర ఉన్నప్పటికి ఉత్పత్తి, దిగుబడి లేకపోవడంతో డీలా పడ్డారు. ప్రస్తుతం దిగుబడి ఉన్నా ధరలు పతనం కావడంతో కిలో నిమ్మ ధర రూ.25 -20 పలుకుతోంది. కిలోకు చిన్న సైజు అయితే 25 కాయలు వస్తాయి.. పెద్ద సైజు అయితే 18 కాయలు వరకూ వస్తాయి. దీంతో దిగుబడి ఉన్న ఫలితం దక్కడం లేదంటూ నిమ్మరైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నిమ్మపై పొగాకు ప్రభావం

ఏజెన్సీ, మెట్ట ప్రాంతంలో పొగాకు, నిమ్మ సాగుపై ప్రభావం చూపుతుంది. దీంతో ఆశించిన స్థాయిలో పెట్టుబడికి దగ్గ ఫలితం లేకపోవడంతో నిమ్మ రైతులు పొగాకు సాగుపై మక్కువ చూపుతున్నారు. గత మూడేళ్లగా పొగాకు ధరలు గరిష్ఠంగా పెరగడంతో నిమ్మను తొలగించి పొగాకు సాగుపై నిమ్మరైతులు సాగుకు మక్కువ చూపుతున్నారు. కాస్తో కూస్తో మిగిలిన నిమ్మ రైతులకు కనీస ధరలు దక్కకపోవడంతో నిరాశచెందుతున్నారు. నిమ్మ ధరలు ఇలాగే ఉంటే రానున్న రోజుల్లో నిమ్మ సాగు కనుమరుగయ్యే పరిస్థితి ఉంటుంది.

కూలీల ఖర్చులు రావడంలేదు



రెండెకరాల నిమ్మతోటలో కాయలు కోసి మార్కెట్‌కు తీసుకెళితే కనీసం కూలీల ఖర్చుకు రావడం లేదు. దీంతో నిమ్మకాయలు కొయ్యకుండా తోటలోనే వదిలేశాం. ప్రభుత్వం నిమ్మసాగు రైతులకు మద్దతు ధర ప్రకటిస్తే రైతులు గట్టెక్కుతారు.

- వి.కృష్ణమూర్తి, రైతు, కరిచర్లగూడెం

సాగుపై మక్కువపోయింది



గత దశాబ్ద కాలంగా నిమ్మ సాగు చేస్తున్నా. అధిక లాభాలు చూసిన రోజులు ఉన్నాయి. ప్రస్తుత నిమ్మ మార్కెట్ అందుకు భిన్నంగా ఉంది. ఎంత శ్రమ పడినా ఫలితం లేక నిమ్మసాగుపై ఉన్న మక్కువ పోయింది. ఈ - మార్కెట్ ఏర్పాటు చేయాలి.

-కాశిం సాహెబ్, రైతు, కొవ్వూరుపాడు

ఏలేరులో పెరుగుతున్న నీటి నిల్వలు


ఏలేరు జలాశయంలో నీటి నిల్వలు

ఏలేశ్వరం, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): ఏలేరు జలాశయంలో నీటి నిల్వలు పెరుగుతున్నాయి. మెస్తారు వర్షాలు, గోదావరి జలాలు విడుదల చేస్తుండడంతో రిజర్వాయర్‌లోని నీరు పెరుగుతోంది. పురుషోత్తమపట్నం ఎత్తిపోతల పథకం నుంచి గోదావరి జలాలు 1225 క్యూసెక్కులు ఏలేరు జలాశయానికి విడుదలవుతున్నాయి. గతంలో ఎన్నడూ లేనిరీతిలో ప్రాజెక్టులో 86.56 మీటర్ల స్థాయిలో 24.11 టీఎంసీల నీటిని నిల్వ చేసే అవకాశం ఉంది. 77.45 మీటర్ల స్థాయిలో 10.66 టీఎంసీలు నిల్వలు ఉన్నాయని అధికారులు తెలిపారు. ఎడమ కాలువ నుంచి విశాఖపట్నంకి 300 క్యూసెక్కులు, ఏలేశ్వరంలోని తిమ్మరాజు చెరువుకు 600 క్యూసెక్కుల వంతులకు నీరు చేరుతోంది. దీంతో రైతులకు సాగు నీరు విడుదలవ్వడంతో రైతులకు పంటలపై భరోసా ఏర్పడింది.

ఉప్పాడ ఉప్పొంగే..

మత్స్యకారుల ఇళ్లల్లోకి సముద్ర కెరటాలు
అవస్థలు పడుతున్న మత్స్యకారులు




ఉప్పాడ మాయాపట్నంలో మత్స్యకారుల ఇళ్లల్లోకి చేరిన నీరు

కొత్తపల్లి, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కొత్తపల్లి ఉప్పాడ తీరంలో సముద్రం ఆదివారం మళ్లీ ఉప్పొంగింది. దీంతో మాయాపట్నంలో మత్స్యకారుల ఇళ్లల్లోకి కెరటాలు రావడంతో బిందెలు, దాకలు, ఇతర వంటసామగ్రి సముద్రంలో కొట్టుకుపోయాయి. పౌర్ణమి కారణంగా సముద్ర కెరటాలు ఉవ్వెత్తున ఎగసిపడుతున్నాయి. సుమారు 15రోజుల కిందట అమావాస్య కారణంగా సముద్రం ఉప్పొంగడం, సుమారు 10 మత్స్యకార ఇళ్లు కొట్టుకుపోవడం విదితమే. గతంలో మాయాపట్నం గ్రామానికి జియోట్యూబ్ రక్షణ కవచంలా ఉండేది. ప్రస్తుతం ఇక్కడ జియోట్యూబ్ ఆనవాలు లేకుండా కొట్టుకుపోవడంతో రోజు సముద్రంలో ఏర్పడే పోటుపాట్లకు... అలాగే అమావాస్య, పౌర్ణమిరోజుల్లోను, అల్పపీడనాలు ఏర్పడే సందర్భాల్లో కెరటాల ధాటికి నష్టపోయేది మాయాపట్నం గ్రామం కావడంతో మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సముద్రకోత నుంచి రక్షించే చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

శ్రీపాద శ్రీవల్లభుడికి ప్రత్యేక పూజలు


శ్రీపాదశ్రీవల్లభులు, దత్తాత్రేయస్వామి, నృసింహ సరస్వతులకు ప్రత్యేక అలంకారం

పిఠాపురం, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురంలోని శ్రీపాద శ్రీవల్లభ మహా సంస్థానానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. శ్రావణ (రాఖీ) పౌర్ణమికి మహారాష్ట్ర, గోవా, ఢిల్లీ, కర్ణాటకలతో పాటు ఉత్తరాది రాష్ట్రాల భక్తులు శ్రీపాదుని దర్శనానికి రావడంతో ఆలయ పరిసరాలు రద్దీగా మారాయి. శ్రీపాద శ్రీవల్లభుడికి అభిషేకాలు, సర్వపుష్ప పూజ, నామార్చన నిర్వహించారు. దత్త హోమం, గోపూజ జరిగాయి. అనంతరం శ్రీపాద శ్రీవల్లభుడు, దత్తాత్రేయ స్వామి, నృసింహ సరస్వతులను పుష్పాలు, తులసి దళాలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఉదయం నుంచి రాత్రి వరకు భక్తుల రద్దీ కొనసాగింది. ఈవో సౌజన్య ఏర్పాట్లను పర్యవేక్షించారు.


పూజల్లో పాల్గొన్న భక్తులు

వాడపల్లికి పోటెత్తిన భక్తులు


వెంకన్న ఆలయంలో అష్టోత్తర పూజలు, పాల్గొన్న భక్తులు

ఆత్రేయపురం, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామిని ఆదివారం అధికసంఖ్య లో భక్తులు దర్శించుకున్నారు. నోము ఆ చరించి అష్టోత్తర పూజలు, నిత్యకళ్యాణాలు నిర్వహించుకుని అన్నప్రసాదం స్వీకరించారు. వివిధ సేవల ద్వారా ఆది వారం ఆలయానికి రూ.6,63,297 ఆదా యం లభించినట్టు ఉపకమిషనర్, ఈవో నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు. అలాగే వకుళమాత అన్నదాన భవన నిర్మాణానికి నిడదవోలు మండలం కాటకోటేశ్వరం గ్రామానికి చెందిన బెల్లపు కొండ కృష్ణమూర్తి, గొడవర్తి వరలక్ష్మి కుటుంబ సభ్యులు రూ.1,01,116 విరాళం సమర్పించారు. సత్తెనపల్లికి చెందిన దేవిశెట్టి నాగేశ్వర రావు- విజయలక్ష్మి దంపతులు రూ.25,116 విరాళం సమర్పించారు. వారికి ఈవో తీర్థప్రసాదాలు, చిత్రపటాలు అందజేశారు.

రూ.6.63 లక్షల ఆదాయం

శరవేగంగా నిర్మాణ పనులు

వెంకన్న ఆలయంలో మాస్టర్ ప్రణాళిక ప్రకారం మెగా ప్రాజెక్టులైన వకుళమాత అన్నప్రసాద భవనం, ఆలయం ఎదురుగా పుష్కరిణి(కొనేరు) నిర్మాణ పనులు శరవేగంగా చేపడుతున్నారు. ఉపకమిషనర్ నల్లం సూర్యచక్రధరరావు పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. శ్రీనివాస ప్రాంగణంలో రూ. 6.10కోట్లతో వకుళమాత అన్నప్రసాద భవన నిర్మాణ పనులు చేపడుతున్నారు. ఈ భవనంలో 3వేల మంది



భక్తులు ఒకేసారి అన్నప్రసాదం స్వీకరించేలా రూపకల్పన చేశారు. మరో రూ.1.50కోట్లతో అన్నప్రసాద భవనంలో సామాగ్రి కొనుగోలు చేసేందుకు దాతలు ముందు కు వస్తున్నారు. ఆలయం ఎదురుగా తిరుమల తరహాలో రూ.2.80 కోట్లతో పుష్కరిణి,(కొనేరు) నిర్మాణం వేగవంతం చేస్తున్నారు. పనులు స్వామివారి ఉత్సవాలకు సిద్ధం చేసేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

తలుపులమ్మకు మకరతోరణం బహూకరణ


అమ్మవారికి బహూకరించిన మకరతోరణం

తునిరూరల్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తుని మండలంలో తలుపులమ్మ అమ్మవారికి కోనసీమ జిల్లా మండపేటకు చెందిన వాసా శ్రీనివాస్ సుమారు రూ.1.25 లక్షలు విలువచేసే 8 కిలోల రాగి, ఇతర లోహాలతో తయారుచేసిన మకరతోరణాన్ని ఆదివారం బహూకరించారు. అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి మకరతోరణాన్ని అమ్మవారి మూలవిరాట్‌కు అలంకరించారు. అమ్మవారిని ఆదివారం వేలాది భక్తులు దర్శించుకున్నారు. దీంతో ఆలయానికి రూ.5లక్షల ఆదాయం సమకూరినట్టు ఆలయ ఈవో విశ్వనాధరాజు తెలిపారు.

ప్రమాదవశాత్తు కొబ్బరి దింపు కార్మికుడి మృతి


సత్యనారాయణ మృతదేహం

ఆత్రేయపురం, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): కొబ్బరి చెట్టు ఎక్కి, దింపుతీస్తుండగా ప్రమాదవశాత్తు కింద పడి కార్మికుడు మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం వసంతవాడకు చెందిన కారఒకి వీరవెంకట సత్యనారాయణ(42) దింపు కార్మికుడు. ఆదివారం రామిరెడ్డి వీరభద్ర రైతు పొలంలో కొబ్బరి కాయలు దింపు తీస్తుండగా ప్రమాదవ శాత్తు చెట్టుపై నుంచి జారి పడ్డాడు. వెంటనే స్థానికులు కొత్తపేట ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మార్గంమధ్యలో మృతి చెందాడు. మృతుడి సోదరుడు నాగరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ ఎస్.రాము తెలిపారు.

ఇంటి నుంచి అదృశ్యం.. గోదావరిలో మృతదేహం లభ్యం

కొవ్వూరు, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): భార్యతో ఘర్షణ పడి ఇంటి నుంచి వెళ్లిపోయిన వ్యక్తి మృతదేహం గోదావరిలో లభ్యమైనట్టు కొవ్వూరు రూరల్ ఎస్‌ఐ కె.శ్రీహరిరావు తెలిపారు. బంధువులకు సమాచారం అందించగా కోరశిఖ సత్యనారాయణ(43)గా గుర్తించారు. అతడు ఈనెల 8వ తేదీన రాత్రి భార్యతో ఘర్షణపడి ఇంటి నుంచి బయటకు వచ్చేశాడు. తిరిగి రాకపోవడంతో మృతుడి కుమారుడు కోరశిఖ లక్ష్మీనారాయణ 9న రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు. ఆదివారం తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు మండలం వాడపల్లి ఇసుక ర్యాంపు వద్ద గోదావరిలో మృతదేహం లభ్యం కావడంతో జాలర్ల సహాయంతో బయటకు తీయించి కొవ్వూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం సత్యనారాయణ మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు.


నిందితుల వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ సాయిప్రశాంత్

కిడ్నాప్ కేసులో ఐదుగురి అరెస్ట్

సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ సురక్షితం

రంపచోడవరం/దేవీపట్నం, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా దేవీపట్నం మండలం శరభవరం సచివాలయంలో వెల్ఫేర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న సోయం శ్రీ సౌమ్యను ఈ నెల 7న ఉదయం 10, 11 గంటల మధ్యలో ఏడుగురు వ్యక్తులు ఇన్నోవా వాహనంలో వచ్చి కిడ్నాప్ చేసిన ఘటనలో ప్రధాన నిందితుడితో పాటు మరో నలుగురిని అరెస్టు చేసినట్టు డీఎస్పీ జి.సాయి ప్రశాంత్ తెలిపారు. ఆదివారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో ప్రత్యేక పోలీసు బృందం గుర్తేడు వద్ద ఏ1 నిందితుడైన కోంకోట అనిల్‌కుమార్, ఏ2 కళ్యాణం ఉమా మహేష్, ఏ3 రాగోలు దుర్గ విఘ్నేష్‌తో పాటు మరోఇద్దరిని అదుపులోకి తీసుకున్నామని, బాధితురాలని సురక్షితంగా రక్షించామని పేర్కొన్నారు. ఏ1 అనిల్‌కుమార్‌పై ఎన్డీపీఎస్ కేసులతో సహా క్రిమినల్ చరిత్ర ఉన్నట్టు తెలిపారు. మరో ఇద్దరు పరారీలో ఉన్నారని తెలిపారు.

ఉమ్మడి జిల్లా గ్రంథాలయ సంస్థ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడిగా వర్మ


వర్మ

అమలాపురం టౌన్, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ ఉద్యోగుల సంఘం జిల్లా శాఖ అధ్యక్షుడిగా జీవీఆర్‌ఎస్‌హెచ్‌కే వర్మ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జిల్లా గ్రంథాలయ సంస్థ ఉద్యోగుల సంఘం ఎన్నికలను ఏపీఓన్జీవో సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పసుపులేటి శ్రీనివాస్, జిల్లా గ్రంథాలయ సంస్థ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జి.రాంబాబు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాదెండ్ల బాబ్జి ఆధ్వర్యంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు వర్మ తెలిపారు. ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎస్.రాజు గౌరవాధ్యక్షుడిగా సలాది సాయిసత్యనారాయణ, అసోసియేట్ అధ్యక్షుడిగా రేపాక వెంకటరాము, ఉపాధ్యక్షుడిగా కె.కిశోర్, సంయుక్త కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు, కోశాధికారిగా జీవీవీఎన్ త్రినాథ్, ఉపాధ్యక్షుడిగా తనికెళ్ల శ్రీనివాస్, మహిళా ప్రతినిధిగా కె.సునీత, రాష్ట్ర ప్రతినిధిగా డొక్కా రాజులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నామన్నారు. ఎన్నికల అధికారులుగా కె.రంగారావు, పి.వెంకటేశ్వరరావు వ్యవహరించారు. జిల్లా గ్రంథాలయ సంస్థలో పనిచేసే ఉద్యోగుల సంక్షేమానికి నిరంతరం పాటుపడతానని ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వర్మ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన్ను రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎండీ జుల్ఫికర్ అలీ, మట్టపర్తి వెంకటేశ్వరరావు, పేపకాయల వెంకటకృష్ణ, చార్లెస్ పలువురు అభినందించారు.

సెమీస్ వన్‌సైడ్!

కాకినాడలో జాతీయ మహిళా జూనియర్ హాకీ పోటీలు



ప్లేయర్ ఆఫ్ ది అవార్డు అందిస్తున్న హాకీ ఆంధ్రప్రదేశ్ డైరెక్టర్ నాగార్జునరెడ్డి


తలపడుతున్న జార్ఖండ్, ఉత్తరప్రదేశ్ జట్లు

కార్పొరేషన్ (కాకినాడ), ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): 15వ హాకీ ఇండియా జూనియర్ మహిళ జాతీయ చాంపియన్‌షిప్-2025లో భాగంగా కాకినాడ క్రీడా మైదానంలోని ఆస్ట్రోటర్ఫ్ హాకీ ఫీల్డ్‌లో ఆదివారం జరిగిన రెండు సెమీ ఫైనల్స్ మ్యాచ్‌లు వార్ వన్ సైడ్ అన్నట్టు సాగాయి. హర్యానా, ఛత్తీస్‌గడ్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో హర్యానా 3-0 స్కోరుతో విజయం సాధించింది. జార్ఖండ్, ఉత్తరప్రదేశ్ జట్ల మధ్య మ్యాచ్‌లో జార్ఖండ్ 3-0 స్కోరుతో విజయం సాధించింది. హాకీ ఆంధ్రప్రదేశ్ డైరెక్టర్ ఎం.నాగార్జునరెడ్డి, కాకినాడ కోరమండల్ సెంటర్ హెడ్ జేఎస్ గంధం ముఖ్యఅతిథులుగా హాజరై మ్యాచ్‌లు వీక్షించారు. కాకినాడ జిల్లా క్రీడాభివృద్ధి అధికారి బి.శ్రీనివాస్‌కుమార్, రాష్ట్ర హాకీ సంఘ కార్యదర్శి హర్షవర్ధన్, సంయుక్త కార్యదర్శి వి.రవిరాజు, కోశాధికారి పి.తామస్‌పీటర్, భవాని శంకర్ మ్యాచ్‌లను పర్యవేక్షించారు.


హాకీ ఆడుతున్న హర్యానా, ఛత్తీస్‌గఢ్ జట్లు

'శ్రీప్రకాష్'లో హోరాహోరీగా ఖోఖో పోటీలు


ఖోఖో ఆడుతున్న బాలురు

తునిరూరల్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తుని శ్రీప్రకాష్ విద్యాసంస్థల్లో అండర్ 14, 17, 19 బాలుర, బాలికల విభాగంలో జరుగుతున్న సీబీఎస్ఈ క్లస్టర్-7 అంతరాష్ట్ర ఖోఖో పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. అండర్ 19 బాలికల విభాగంలో ప్రథమ స్థానం సిస్టర్ నివేదిత స్కూల్ హైదరాబాద్, ద్వితీయ స్థానం వెరిటాస్ సైనిక్ స్కూల్ తిరుపతి, తృతీయ స్థానంలో సివిఆర్‌రెడ్డి పబ్లిక్ స్కూల్ ఏలూరు, హార్వెస్ట్ పబ్లిక్ స్కూల్ ఖమ్మం నిలిచాయి. విజేతలకు సోమవారం జరిగే ముగింపు కార్యక్రమంలో బహుమతి ప్రదానం చేస్తారు. కార్యక్రమంలో సీబీఎస్ఈ పరిశీలకులు సీహెచ్ఎల్ఎం శ్రీనివాస్, విద్యాసంస్థల సంయుక్త కార్యదర్శి విజయ్‌ప్రకాష్, సీనియర్ ప్రిన్సిపాల్ ఎంవివిఎస్ మూర్తి, వైస్ ప్రిన్సిపాల్ ఎం.అపర్ణ పాల్గొన్నారు.

13న వాలీబాల్ క్రీడాకారుల ఎంపిక

కార్పొరేషన్ (కాకినాడ), ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది డిసెంబరు 4 నుంచి 13 వరకు చైనాలోని శాంగ్లోలో నిర్వహించనున్న అండర్-15 బాలబాలిక ప్రపంచ స్కూల్ వాలీబాల్ చాంపియన్‌షిప్‌కు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నుంచి క్రీడాకారుల ఎంపిక ఈనెల 13న కాకినాడలోని జిల్లా క్రీడా మైదానంలో చేపట్టనున్నట్టు ఎస్‌జీఎఫ్ సెక్రటరీ లంక జార్జి ఆదివారం తెలిపారు. క్రీడాకారులు ఉదయం 9గంటలకు హాజరుకావాలన్నారు. ఎంపికైన వారు 18న విజయవాడ పటమట కేబీసీ జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించే రాష్ట్ర స్థాయి జట్టు ఎంపికలో పాల్గొంటారన్నారు. తర్వాత జాతీయ జట్టు ఎంపిక ఉంటుందన్నారు. స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఎంపికలు జరుగుతాయని ఆయన తెలిపారు.

పొల్లూరు జలవిద్యుత్ కేంద్రంలో శరవేగంగా రెండో దశ పనులు

ఏపీ జెన్కో సీలేరు కాంప్లెక్స్ చీఫ్ ఇంజనీర్

మోతుగూడెం, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): పొల్లూరు జల విద్యుత్ కేంద్రం రెండో దశలో చేపట్టిన రెండు యూనిట్ల నిర్మాణం పనులు శరవేగంగా సాగుతున్నాయని ఏపీ జెన్కో సీలేరు కాంప్లెక్స్ చీఫ్ ఇంజనీర్ కెవీ.రాజారావు తెలిపారు. వచ్చే ఏడాది మార్చి నాటికి అందుబాటులోకి 230 మెగావాట్లు విద్యుత్తు ఉంటుందన్నారు. ఒక్కొక్కటి 115 మెగావాట్ల సామర్థ్యంతో నిర్మిస్తున్న ఈ యూనిట్లు మార్చి నాటికి అందుబాటులోకి వస్తాయన్నారు. ప్రస్తుతం ఆరో యూనిట్‌కు స్పిరల్ కేస్ మూడో దశ కాంక్రీట్ పనులు జరుగుతున్నాయని మరొక దశ కాంక్రీట్ వేస్తే పనులు పూర్తవుతాయన్నారు. 5వ యూనిట్‌కు టర్బయిన్ ఫ్లోర్ కాంక్రీట్ పనుల కోసం రిఇజన్ ఫోర్స్‌మెంట్ పనులు జరుగుతున్నాయని ఇవి పూర్తయిన వెంటనే జనరేటర్ బ్యారల్ వరకు ఇంకొక దశ కాంక్రీట్ పనులు చేపట్టాలని, అనంతరం ఎలక్ట్రికల్ మెకానిక్ పనులు ప్రారంభిస్తారన్నారు.

జేఎన్టీయూకేలో ముగిసిన ఐడీపీ వర్క్‌షాప్

జేఎన్టీయూకే, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): కాకినాడలోని జేఎన్టీయూ సెనేట్ హాల్లో ఐక్యూఏసీ, కెపాసిటీ బిల్డింగ్ డైరెక్టరేట్ ఆధ్వర్యంలో ఇనిస్టిట్యూషనల్ డవలప్‌మెంట్ ప్లాన్‌పై నిర్వహిస్తున్న వర్క్‌షాప్ ఆదివారం ముగిసింది. అవుట్ లైన్‌ఫర్ డవలపింగ్ ఐడీపీ, ఇంప్లిమెంటేషన్ స్ట్రాటజీస్ పై కశ్మీర్ సెంట్రల్ యూనివర్శిటీ వీసీ రవీంద్రనాథ్, ఎస్టాబ్లిష్‌మెంట్ ఆఫ్ ఐడీపీ సెల్ గురించి గౌరీదత్ శాస్త్రి వివరించగా డ్రాఫ్టింగ్ ఐడీపీ ప్యానల్ డిస్కషన్‌లో కె.వెంకటేష్ మోడరేటర్‌గా వ్యవహరించారు. వర్క్‌షాప్‌లో జేఎన్టీయూ వీసీ సీఎస్‌ఆర్కే ప్రసాద్, డైరెక్టర్ బాలాజీ, డైరెక్టర్లు, ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు పాల్గొన్నారు.



వీసీ ప్రసాద్‌తో వర్క్‌షాప్‌లో పాల్గొన్న అతిథులు, ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు

ఆటోమేటిక్.. ఐడియా..

ఆటోపై సోలార్ ప్యానెల్ బిగింపు
కాకినాడలో డ్రైవర్ వినూత్న ఆలోచన





ఈ పెద్దాయన బుర్రకు పదునుపెట్టాడు. పెరుగుతున్న డీజిల్ ధరలతో బతుకు 'బండి' లాగడం కష్టమని భావించి ఇటీవల ఓ ఈ-ఆటోను కొనుగోలు చేశాడు. 8 గంటలు చార్జింగ్ పెడితే సుమారు వంద కిలోమీటర్ల వరకు ప్రయాణించొచ్చు. అయితే రోజుకు 8 గంటల పాటు బ్యాటరీకి చార్జింగ్ పెడితే కరెంటు బిల్లు తడిసిమోపెడవుతోందని.. ఏం చేయాలని ఆలోచించసాగాడు. తన పొలంలో నీళ్లు తోడే మోటారుకు సోలార్ కనెక్షన్ ఉండడం చూసి.. అంత పెద్ద మోటారే సోలార్‌తో పనిచేస్తున్నప్పుడు.. తన ఈ- ఆటోకు పనిచేయదా? అని ఆలోచించాడు. తన ఆలోచనను కాకినాడలోని అచ్యుతాపురం రైల్వేగేటు సమీపంలో ఉన్న ఓ సోలార్ టెక్నీషియన్‌కు తెలిపాడు. దీంతో 48 ఓల్ట్స్, 580 వాట్స్ ఉన్న సోలార్ పలకను ఆటోపై భాగాన బిగించాడు. సూర్యకాంతితో ఆటో రయ్.. రయ్ మని కాకినాడ వీధుల్లో తిరగడం ప్రారంభమైంది. ఇంతకీ ఈయన పేరు చెప్పలేదు కదూ.. భాస్కరరావు, ఊరు పెద్దపూడి మండలం అచ్యుతాపురత్రయం. కొన్నేళ్లుగా ఆటో డ్రైవర్‌గా జీవితాన్ని నెట్టుకొస్తున్నారు. "గతంలో నా ఈ-ఆటోకు గంటల తరబడి చార్జింగ్ పెడితే.. రూ.1500కు పైగా కరెంటు బిల్లు వచ్చేది. ఈ సోలార్ ప్యానెల్ ఏర్పాటు చేయడంతో చార్జింగ్ పెద్దగా పెట్టాల్సిన అవసరం లేకుండా పోయింది. ఇప్పుడు మా ఇంటి కరెంటు బిల్లు రూ.800 వరకు వస్తోంది. సోలార్ విద్యుత్ కాస్త డబ్బు ఆదా అవుతోంది." అని పేర్కొన్నాడు.

(కాకినాడ - ఆంధ్రజ్యోతి)

అమలాపురం

క్రైస్తవ కమ్యూనిటీ హాల్ ఆస్తి బదిలీ చేసిన వారిపై కేసు

అంతర్వేది, ఆగస్టు10(ఆంధ్రజ్యోతి): సఖినేటిపల్లి గ్రామం శాంతినగర్ సంఘ క్రైస్తవ కమ్యూనిటీ హాల్ ఆస్తిని అక్రమంగా బదిలీ చేశారంటూ కమ్యూనిటీ హాలు ప్రతినిధులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈఫిర్యాదుపై కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ దుర్గాప్రసాద్ తెలిపారు.

సొసైటీలకు త్రిసభ్య కమిటీల నియామకం

ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

అంబాజీపేట, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): మండలంలో ముక్కామల మినహా ఐదు సొసైటీలకు త్రిసభ్య కమిటీలను నియమిస్తూ ఆదివారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. అంబాజీపేట సొసైటీ ఛైర్మన్‌గా జనసేన పార్టీకి చెందిన అరిగెల సూర్యనారాయణమూర్తి(సూరిబాబు), సభ్యులుగా ఉందుర్తి సత్యనారాయణ, పితాని వేమవెంకట సత్యప్రసాద్, చిరతపూడి సొసైటీ ఛైర్మన్‌గా టీడీపీకి చెందిన రంపం సత్యనారాయణ, సభ్యులుగా కొత్తలంక సుబ్బారావు, బండారు కామరాజు, గంగలకుర్రు సొసైటీకి ఛైర్మన్‌గా గంగలకుర్రు అగ్రహారం గ్రామానికి చెందిన జనసేన నాయకులు అల్లాడ సూర్యనారాయణమూర్తి, సభ్యులుగా నెల్లి వరలక్ష్మి, కాగితాపల్లి పద్మావతి, ఇరుసుమండ సొసైటీ ఛైర్మన్‌గా టీడీపీకి చెందిన సుంకర గణపతిరావు, సభ్యులుగా దంతులూరి సూర్యనారాయణరాజు, నూకపెయ్యి సూర్యచంద్రరావు, పుల్లేటికుర్రు సొసైటీ ఛైర్మన్‌గా టీడీపీకి చెందిన దొమ్మేటి సురేష్‌కుమార్, పెచ్చెట్టి శివసత్యహరిబాబు, గొలకోటి సత్యనరేష్‌లను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వుల జారీచేసింది. ముక్కామల సొసైటీ త్రిసభ్య కమిటీని త్వరలో ప్రకటించనున్నారు.

పి.గన్నవరం, (ఆంధ్రజ్యోతి): నాగుల్లంక మినహా ఐదు సొసైటీలకు ఛైర్‌పర్సన్లు, సభ్యులను నియమిస్తూ ఆదివారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. వీరు వచ్చే ఏడాది జనవరి 30వరకు కొనసాగుతారని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. నాగుల్లంక సొసైటీకి రెండు రోజుల్లో పాలక వర్గాన్ని ప్రకటిస్తారని సమాచారం. పి.గన్నవరం సొసైటీ ఛైర్‌పర్సన్‌గా సాధనాల శ్రీవెంకటసత్యనారాయణ, సభ్యులుగా రొక్కాల రవికుమార్, కుడిపూడి నారాయణమూర్తి, ముంగండ సొసైటీ ఛైర్‌పర్సన్‌గా మట్టపర్తి వెంకటేశ్వరరావు, సభ్యులుగా యల్లమిల్లి లీలావతి, నూలు రమేష్, నరేంద్రపురం సొసైటీ ఛైర్‌పర్సన్‌గా తోలేటి నారాయణమూర్తి, సభ్యులుగా అరిగెల నాగభూషణం, గిడ్ల రవిరాజు, ఉడిమూడి సొసైటీ ఛైర్‌పర్సన్‌గా పెనుమాల రెడ్డి వెంకటరత్నం నాయుడు, సభ్యులుగా దొడ్డిపట్ల సాంబసదా శివమూర్తి, సుంకర వీరవెంకటసత్య నారాయణమూర్తి, ఏనుగులపల్లి సొసైటీ ఛైర్‌పర్సన్‌గా బొరుసు సత్యనారాయణ, సభ్యులుగా మట్టపర్తి మణికంఠ, సాపె సత్యనారాయణలను నియమించారు.

మలికిపురం, (ఆంధ్రజ్యోతి): మండలంలోని తొమ్మిది వ్యవసాయ సహకార పరపతి సంఘాలకు త్రిసభ్య కమిటీలను నియమిస్తూ ప్రభుత్వం ఆదివారం ఉత్తర్వులు జారీ చేసిందని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ తెలిపారు. విశ్వేశ్వరాయపురంలోని ఆయన క్యాంపు కార్యాలయంలో వివరాలు వెల్లడించారు. మలికిపురం త్రిమెన్ కమిటీ ఛైర్మన్‌గా జంపన వెంకటసత్యనారాయణరాజు, సభ్యులుగా శిరిగినీడి త్రిమూర్తులు, గుబ్బల నరసింహస్వామి, చింతలమోరి ఛైర్‌పర్సన్‌గా దొడ్డా సూర్యనాగప్రసాద్, సభ్యులుగా గాడి సీతారామరాజు, రాపాక చంద్రశేఖర్, గూడపల్లి ఛైర్‌పర్సన్‌గా పున్నం గంగారావు, సభ్యులుగా ఉలిశెట్టి శ్రీనివాస్, కాండ్రేగుల సత్యనారాయణ, గుడిమెళ్లంక ఛైర్‌పర్సన్‌గా గమిడి శ్రీనివాసరావు, సభ్యులుగా దేవ సభ్యులుగా కృష్ణమూర్తి, కట్టా సత్యనారాయణ నియమితులయ్యారు. బట్టేలంక ఛైర్‌పర్సన్‌గా బోనం నాగేశ్వరరావు, సభ్యులుగా మాదిరెడ్డి సాయిబాబు, గుబ్బల సుబ్బారాయుడు తూర్పుపాలెం ఛైర్‌పర్సన్‌గా యెనుముల సూర్యనారాయణమూర్తి, సభ్యులుగా పితాని నాగరాజు, మోటూరి ప్రసాద్, కేశనపల్లి ఛైర్‌పర్సన్‌గా ఆకుల సత్యనారాయణ, సభ్యులుగా అడబాల మూలాస్వామి, దొంగ నాగేశ్వరరావు, లక్కవరం ఛైర్‌పర్సన్‌గా గంటా వెంకటరామకృష్ణనాయుడు, సభ్యులుగా ఆదుర్తి నరసింహారావు, యాండ్ర కుమారస్వామి, రామరాజులంక ఛైర్‌పర్సన్‌గా ఉంగరాల వెంకటబాలాజీ, సభ్యులుగా మేడిచర్ల భాస్కరరావు, నున్నబోయిన ఏసుబాబులను ప్రకటించారు. అదేవిధంగా మోరి ఛైర్‌పర్సన్‌గా బళ్ల రామారావు, సభ్యులుగా మండా రాధాకృష్ణ, కడలి రాంబాబు, వియ్యారివారిమెరక ఛైర్‌పర్సన్‌గా వీరా వెంకటరామారావు, సభ్యులుగా చెంపాటటి సుజాత, బర్రే చంద్రరావులను ప్రకటించారు.


పి.గన్నవరం సొసైటీ కార్యాలయం

రాజోలు, (ఆంధ్రజ్యోతి): బి.సావరం సొసైటీ ఛైర్‌పర్సన్‌గా కాండ్రేగుల కుశులుడు, సభ్యులుగా అప్పారి సాయిబాబా, పెచ్చెట్టి వెంకటశ్రీనివాస్, చింతలపల్లి ఛైర్‌పర్సన్‌గా పిప్పళ్ల రాము, సభ్యులుగా దేశంశెట్టి లీలామానుషిఅప్పాజీ, మామిడిశెట్టి మధుసూదనరావు, కడలి ఛైర్‌పర్సన్‌గా కడలి శ్రీనేతికొండ, సభ్యులుగా వై.వెంకటరమణమూర్తి, యాలంగి వరప్రసాద్, కాట్రేనిపాడు ఛైర్‌పర్సన్‌గా ఉలిసి శ్రీనివాసరావు సభ్యులుగా కె.వెంకటేశ్వరరావు, కె.భైరవమూర్తి, పొన్నమండల ఛైర్‌పర్సన్‌గా అడబాల సూర్యవెంకటరామకృష్ణ (రాంబాబు), సభ్యులుగా ముగ్గ పెద్దిరాజు, దాకే ఏడుకొండలు, రాజోలు ఛైర్‌పర్సన్‌గా కసుకుర్తి త్రినాథస్వామి, సభ్యులుగా రేకపల్లి శ్రీనివాస్, సుంకరపు ఆదినారాయణ, తాటిపాక ఛైర్‌పర్సన్‌గా గుండాబత్తుల నారాయణస్వామి (తాతాజీ) సభ్యులుగా లక్కింశెట్టి నానాజీ, వీర వెంకటసూర్యసుబ్బారావు, ఎం.అంకరాజులను నియమిస్తూ ఉత్తర్వులు వెలుబడ్డాయి.

బుద్ధుని బోధనలు అనుసరణీయం


ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన కార్యవర్గం

ముమ్మిడివరం, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): ప్రపంచానికి శాంతిని పంచిన బుద్ధుని బోధనలే సదా అనుసరణీయమని బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా కార్యవర్గ సభ్యుడు ఎస్ఎస్ఆర్ భూపతి పేర్కొన్నారు. ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కన్వెన్షన్ హాలులో జిల్లా అధ్యక్షుడు పెనుమాల సుధీర్ అధ్యక్షతన ఆదివారం శ్రావణ పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. తొలుత గౌతమ బుద్ధుని, అంబేడ్కర్ చిత్రపటాలకు పుష్పాలంకరణచేసి పంచశీల పాటించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన భూపతి మాట్లాడుతూ ప్రపంచంలోనే మొట్టమొదటి సామాజిక విప్లవకారుడైన బుద్ధుడు మానవాళి మనుగడకు శీల, ప్రజ్ఞ, కరుణ సిద్ధాంతాల ద్వారా సమాజానికి శాంతిని పంచారన్నారు. అనంతరం జిల్లా కార్యవర్గ ఎన్నిక జరిగింది. జిల్లా అధ్యక్షుడిగా కేవీవీ సత్యనారాయణ, ఉపాధ్యక్షులుగా మాగాపు ఈశ్వరరావు, యలమంచిలి సురేష్, జనరల్ సెక్రటరీగా బుడిది బాబూరాజేంద్రప్రసాద్, జేవీవీ సత్యనారాయణ, తరపట్ల వెంకటేశ్వరరావు, కోశాధికారి కేవీవీ సత్యనారాయణ(కవి)లను ఎన్నుకున్నారు. కార్యవర్గ సభ్యులుగా చింతపల్లి శివకుమార్, కాట్రు అప్పారావు, కొట్టాల నరసింహారావు, జల్లి బాలకృష్ణ, కుంచే చినబాబు, దడాల రాజశేఖర్‌లు ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారులుగా ఎస్ఎస్ఆర్ భూపతి, మట్టా వెంకట్రావులు వ్యవహరించారు. నూతన కార్యవర్గాన్ని పలువురు పుష్పగుచ్ఛాలతో అభినందించారు. చీకురుమెల్లి చిరంజీవి, మట్టా ధనకాసులు, సకిలే పృథ్విరాజ్, నందికి ధనరాజు, పెట్టా శ్రీనివాసరావు, గిడ్ల రమేష్, రమణ, కార్యకర్తలు పాల్గొన్నారు.

శంకరగుప్తం డ్రెయిన్ సమస్యకు పరిష్కారం


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ సోము వీర్రాజు

మలికిపురం, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): శంకరగుప్తం మేజర్ డ్రెయిన్ సమస్య త్వరలో పరిష్కారం కానుందని ఎమ్మెల్సీ సోము వీర్రాజు అన్నారు. చింతలమోరిలో ఎఫ్‌సీఐ మెంబర్ దొడ్డా నాగబాబు నివాసం వద్ద జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ శంకరగుప్తం మేజర్ డ్రెయిన్ ముంపు సమస్య వల్ల తీర ప్రాంత గ్రామాలైన కేశనపల్లి, తూర్పుపాలెం, శంకరగుప్తం, చింతలమోరి తదితర గ్రామాల రైతులు నష్టపోతున్నారని, ఈసమస్యలన్నీ అధికారుల దృష్టికి తీసుకువెళ్లారని ఆయన అన్నారు. వైసీపీ పాలనలో రాష్ట్రం సర్వనాశనమైందని విమర్శించారు. కూటమి ప్రభుత్వానికి కేంద్రం వేల కోట్ల నిధులతో సహకరిస్తుందని, అభివృద్ధి, సంక్షేమం జరుగుతుందని, ప్రజలు స్వాగతిస్తున్నారని అన్నారు. రోడ్ల నిర్మాణం, జలజీవన్ మిషన్ ద్వారా ఇంటింటికీ కుళాయిలు, రైతుల ప్రయోజనాల కోసం పంటకు పెట్టుబడి నిధులు, పంటకాల్వలో పూడిక తొలగింపు వంటి అనేక మౌలిక సదుపాయాల ద్వారా కూటమి ప్రభుత్వం ముందుకు వెళుతుందని ఆయన అన్నారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే వేమా, ఎఫ్‌సీఐ మెంబర్ దొడ్డా నాగబాబు, మాలే శ్రీనివాసనగేష్, అడబాల రాంబాబు, మేడిచర్ల చాణక్య తదితరులు పాల్గొన్నారు.

టీచర్ల సమస్యల పరిష్కారంలో యూటీఎఫ్ కీలక పాత్ర

- ఎంఈవో లక్ష్మీనారాయణ
- యూటీఎఫ్ ఆవిర్భావ వేడుకలు


మామిడికుదురులో యూటీఎఫ్ పతాకాన్ని ఆవిష్కరించిన నాయకులు

మామిడికుదురు, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించడంలో యూటీఎఫ్ కీలక పాత్ర పోషిస్తుందని ఎంఈవో లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. యూటీఎఫ్ 52వ ఆవిర్భావ దినోత్సవాన్ని మామిడికుదురు ఎమ్మార్సీ కార్యాలయం వద్ద ఆదివారం ఘనంగా నిర్వహించారు. యూటీఎఫ్ సీనియర్ నాయకుడు కుడుపూడి సత్యనారాయణ యూటీఎఫ్ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈసందర్భంగా పలువురు మాట్లాడుతూ ప్రస్తుతం ఉపాధ్యాయులు బోధనేతర పనులతో, యాప్‌లతోను చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, విద్యార్థులకు బోధనా సమయం సరిపోవడం లేదని, ఆయా పనులను వ్యతిరేకిస్తూ యూటీఎఫ్ రాబోయే రోజుల్లో పోరాటం చేస్తుందన్నారు. ఉపాధ్యాయులకు రావాల్సిన ఆర్థిక బకాయిలు వెంటనే చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కోశాధికారి సీహెచ్ కేశవరాజు, జి.నాగేంద్రప్రసాద్, బి.పెద్దిరాజు, ఆర్.నాగేశ్వరరావు, వై.నాగేశ్వరరావు, కె.అరుణజ్యోతి, ఎన్.వరలక్ష్మి, ఆర్.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అంబాజీపేట, (ఆంధ్రజ్యోతి): యూటీఎఫ్ ఆవిర్భావ వేడుకలను కొర్లపాటివారిపాలెం ప్రాథమిక పాఠశాలలో ఆదివారం నిర్వ హించారు. యూటీఎఫ్ పతాకాన్ని సీనియర్ నాయకుడు కేతా గంగాధరం ఆవిష్కరించారు. ఈసందర్భంగా వక్తలు మాట్లాడుతూ యూటీఎఫ్ పోరాటాల ద్వారా సాధించిన విజయాలు భవిష్యత్ తరాల స్ఫూర్తిగా తీసుకుని ఉద్యమాన్ని ముందుకు తీసుకువెళ్లాలన్నారు. మట్టపర్తి రాంబాబు, ముషిణి పుల్లయ్య, బీర రామాంజనేయులు, యూటీఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులు ఎం.సూర్యనారాయణ, పి.విశ్వప్రసాద్, పితాని శ్రీనివాస్, పరమట ఏడుకొండలు, పి.నారాయణమూర్తి, జి.రాంబాబు, అప్పారి శశికుమార్, గుత్తుల చంద్రశేఖర్ పాల్గొన్నారు.

అయినవిల్లి, (ఆంధ్రజ్యోతి): ముక్తేశ్వరంలోని మండల విద్యావనరుల కేంద్రంలో యూటీఎఫ్ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. యూటీఎఫ్ పతాకాన్ని సీనియర్ ఉపాధ్యాయుడు పీవీ సూర్యనారాయణమూర్తి ఆవిష్కరించారు. ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించే ఏకైక సంఘం యూటీఎఫ్ అని, లక్ష సభ్యత్వం దాటి రాష్ట్రంలోని అతిపెద్ద ఏకైక సంఘంగా యూటీఎఫ్ నిలిచిందన్నారు. అనంతరం ఫోన్ డైరీని ఆవిష్కరించి ఉపాధ్యాయులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండలశాఖ గౌరవాధ్యక్షుడు జి.సాయిశ్రీనివాస్, అధ్యక్షుడు టీబీ ఈశ్వరరావు, కార్యదర్శి బి.సందీప్, జిల్లా కార్యదర్శి పి.మురుగేశ్వరరావు, సంక్షేమ పథకం డైరెక్టర్ బి.శ్రీనివాసరావు, జి.గంగాద్రిరావు, జి.బంగార్రాజు, కిరణ్‌తేజ పాల్గొన్నారు.

కాంగ్రెస్ పొలిటికల్ అఫైర్స్ కమిటీ సభ్యుడిగా చిట్టిబాబు


చిట్టిబాబును అభినందిస్తున్న నాయకులు

అమలాపురం టౌన్, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పొలిటికల్ అఫైర్స్ కమిటీ సభ్యుడిగా పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబును పార్టీ అధిష్ఠానం నియమించడం పట్ల కాంగ్రెస్ శ్రేణులు హర్షాతిరేకాలు వ్యక్తంచేశారు. చిట్టిబాబును కలుసుకుని అభినందనలు తెలిపారు. అమలాపురం కాంగ్రెస్ పట్టణశాఖ అధ్యక్షుడు వంటెద్దు బాబి, మండలశాఖ అధ్యక్షుడు ఏలేశ్వరపు రాధాకృష్ణ, ప్రధాన కార్యదర్శి మొల్లేటి వెంకటేశ్వరరావు, కుడుపూడి శ్రీనివాస్ తదితరులు చిట్టిబాబును అభినందించి సత్కరించారు.

నేడు జాబ్‌మేళా

అమలాపురంటౌన్,ఆగస్టు10(ఆంధ్రజ్యోతి): నల్లా చారిటబుల్ ట్రస్టు, శ్రీవెంకటేశ్వర డిగ్రీ కళాశాల, రిలయన్స్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల11న అమలాపురం వెంకటేశ్వరా డిగ్రీ కళాశాల ప్రాంగణంలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు ట్రస్టు ఛైర్మన్ నల్లా పవన్‌కుమార్ తెలిపారు. ఇంటర్, ఫార్మసీ, మెకానికల్, ఎలక్ట్రికల్, డిప్లమో పూర్తిచేసిన విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారన్నారు. ప్రముఖ ఔషధ సంస్థ ఎంఎస్ఎన్ లాబోరేటరీ హైదరాబాద్‌లో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారన్నారు. 50శాతం మార్కులతో ఉత్తీర్ణులైఉన్న అభ్యర్థులకు రూ.2.30లక్షల వార్షిక వేతనంతో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారన్నారు.

జగన్ దళితులకు క్షమాపణ చెప్పాలి

- ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆనందరావు

అమలాపురం టౌన్, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): వైసీపీ నాయకులు దళితులపై దారుణమైన దాడులకు తెగబడుతున్నారని అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు ఆరోపించారు. తక్షణం దళితులకు మాజీ ముఖ్యమంత్రి జగన్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అమలాపురంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆనందరావు మాట్లాడారు. సింగయ్య అనే దళితుడిని కాన్వాయ్ వాహనాన్ని ఎక్కించి తొక్కించి చంపిన ఘనత మీదేనన్నారు. భూమన కరుణాకరరెడ్డి అనుచరులు దినేష్‌రెడ్డి, అనిల్‌రెడ్డి మరికొందరితో కలిసి దళిత యువకుడిని గదిలో బంధించి అతి క్రూరంగా కొట్టి వీడియోలు తీసిన ఘన చరిత్ర కూడా మీదేనన్నారు. దళిత సమాజంపై ఈ తరహా దాడులను ఎవరూ సహించరన్నారు. సమావేశంలో అముడా ఛైర్మన్ అల్లాడ స్వామినాయుడు, తెలుగుమహిళ జిల్లా అధ్యక్షురాలు పెచ్చెట్టి విజయలక్ష్మి, నాయకులు కర్రి రామస్వామి, అధికారి బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

మలికిపురం, (ఆంధ్రజ్యోతి): దళితులపై దాడిచేసిన వైసీపీ నాయకుడు భూమన కరుణాకరరెడ్డి అనుచరులను వెంటనే అరెస్టు చేయాలని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఎస్సీ సెల్ అధికార ప్రతినిధి గెడ్డం సింహ అన్నారు. విశ్వేశ్వరాయపురంలో గోనిపాటి రాజు అధ్యక్షతన జరిగిన పార్టీ నియోజకవర్గ ఎస్సీసెల్ అత్యవసర సమావేశంలో సింహ మాట్లాడారు. దళితులపై దాడి చేసిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులతో పాటు హత్యాయత్నం కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో రాపాక నవరత్నం, గోనిపాటి రాజు, చవ్వాకుల వెంకటరత్నం, యడ్ల బాబులు, విప్పర్తి ప్రసాద్, బోస్, నరేష్, చవ్వాకుల ప్రవీణ్ పాల్గొన్నారు.

అయినవిల్లి, (ఆంధ్రజ్యోతి): దళితులకు మాజీ ముఖ్యమంత్రి జగన్ క్షమాపణ చెప్పాలని టీడీపీ హెచ్‌ఆర్డీ సభ్యుడు నేదునూరి వీర్రాజు డిమాండ్ చేశారు. జగన్ మానవత్వం మరచి మాట్లాడుతున్నారని విమర్శించారు. మా కార్యకర్తలను మేమే చంపుకున్నామని దళితులు సింగయ్య మృతిపై నిస్సిగ్గుగా మాట్లాడడాన్ని రాష్ట్ర ప్రజలంతా చూశారన్నారు. భూమన కరుణాకరరెడ్డి అనుచరులు అనిల్‌రెడ్డి, దినేష్‌రెడ్డి, మరో ముగ్గురు కలిసి ఒక దళిత యువకుడిని గదిలో బంధించి క్రూరంగా దాడిచేసిన ఘటనను గుర్తు చేశారు.

రాష్ట్ర స్థాయి చెస్ పోటీలకు ఆరుగురు ఎంపిక


క్రీడాకారులకు సర్టిఫికెట్లు అందజేసిన ఏబీ నాయుడు

అమలాపురం టౌన్, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరిచిన ఆరుగురు క్రీడాకారులను రాష్ట్ర స్థాయి చెస్ పోటీలకు ఎంపిక చేసినట్టు రాష్ట్ర చెస్ అసోసియేషన్ కార్యదర్శి కవురు జగదీష్ తెలిపారు. కోనసీమ జిల్లా చెస్ అసోసియేషన్ కార్యదర్శి తాడి వెంకటసురేష్ ఆధ్వర్యంలో ఆదివారం అమలాపురం విద్యా నిధి విద్యా సంస్థల ప్రాంగణంలో అండర్-17 జిల్లాస్థాయి చెస్ పోటీలు నిర్వహించారు. జిల్లాలోని 50మంది క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. బాలుర విభాగంలో గిరిమణి శేఖర్ ప్రథమ, బందారు నానిబాబు ద్వితీయ, తాడి సాయి వెంకటేష్ తృతీయ స్థానాలు సాధించారు. బాలికల విభాగంలో ఫణిశెట్టి ధరణి ప్రథమ, బొడ్డు శాన్వి ద్వితీయ, పసుపులేటి రేష్మ తృతీయ స్థానాలు సాధించారు. ఈనెల16,17తేదీల్లో కాకినాడ జేఎన్‌టీయూలో నిర్వహించే రాష్ట్రస్థాయి అండర్-17 చాంపియన్ షిప్ పోటీల్లో జిల్లా నుంచి వారు ప్రాతినిధ్యం వహిస్తారని రాష్ట్ర కార్యదర్శి జగదీష్ తెలిపారు. జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు విద్యానిధి విద్యాసంస్థల ఛైర్మన్ ఆకుల బాపన్ననాయుడు షీల్డులు, సర్టిఫికెట్లను అందజేసి అభినందించారు.

అమలాపురంలో రాష్ట్ర స్థాయి కరాటే పోటీలు


రాష్ట్ర స్థాయి ఓపెన్ కరాటే చాంపియన్ షిప్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మంత్రి సుభాష్

అమలాపురం టౌన్, ఆగస్టు10(ఆంధ్రజ్యోతి): ఐదవ ఇంటర్ స్టేట్ ఇన్విటేషన్, ఓపెన్ కరాటే చాంపియన్ షిప్ పోటీలను సెప్టెంబరు14న అమలాపురంలో నిర్వహిస్తున్నట్టు టోర్నమెంట్ చీఫ్ ఆర్గనైజర్ పడాల అంజి తెలిపారు. పవర్‌కిక్ షోటోకాన్ కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగే ఈపోటీల పోస్టర్లు, ట్రోఫీలను కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ఆవిష్కరించారు. ఈపోటీల్లో ఉభయ తెలుగురాష్ట్రాల నుంచి వెయ్యి మంది విద్యార్థులు పాల్గొంటారని సురేష్ వివరించారు. టీడీపీ సీనియర్‌నాయకుడు గంధం పల్లంరాజు, టోర్నమెంటుఆర్గనైజర్ చిక్కం సురేష్, టోర్నమెంటు కార్యదర్శి ఎ.రవి, జనసేన వీరమహిళ కొప్పుల నాగమానస, ఎంపీటీసీలు మోటూరి కనకదుర్గ, అడపా సత్తిబాబు, దొంగ శ్రీనుపాల్గొన్నారు.

కోపరేటివ్ స్టోర్స్ లిక్కర్ షాపు ప్రారంభం

యానాం, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): స్థానిక జాతీయ రహదారిని ఆనుకుని యానాం సహకార శాఖ ఆధీనంలోని ది యానాం కోపరేటివ్ స్టోర్స్ లిమిటెడ్‌కు సంబంధించిన లిక్కర్‌షాపును ఆదివారం పరిపాలనాధికారి మునిస్వామి ప్రారంభించారు. తొలుత మునిస్వామి, యానాం స్టోర్స్ అధ్యక్షుడు లంక విద్యాసాగర్, ముమ్మిడి శంకర్, సీగల్స్ మేనేజర్ మురళిధరన్‌లు పూజ కార్యక్రమాలు నిర్వహించి ప్రారంభించారు. అలాగే స్టోర్స్ ఆధ్వర్యంలో మూడు తూములు, పాతబస్టాండ్ సమీపంలో లిక్కర్‌షాపులు త్వరలో ప్రారంభిచేందుకు చర్యలు చేపడుతున్నారు.

ఆక్వా రైతులను ఆదుకోవాలి

అల్లవరం, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సుంకాల బారి నుంచి నష్టపోతున్న రొయ్యల కొనుగోలుదారులు, ఆక్వా రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కొపనాతి వెంకట్రాజు విజ్ఞప్తి చేశారు. సుంకాల దెబ్బతో ఎక్కువ ధరకు రొయ్యలు కొన్నాక రొయ్య ధర పతనమై అటు ఎగుమతిదారులు ఇటు రొయ్యల కొనుగోలుదారులు ఆక్వా రైతులకు కూడా నష్టాలు వాటిల్లుతున్నాయన్నారు.

బీరు బాటిల్‌తో వ్యక్తిపై దాడి

యానాం, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): బీరుబాటిల్‌తో దాడి చేసిన ఘటనలో ఒక వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. శనివారంరాత్రి మహమ్మద్ షఫీ బైకుపై వెళుతూ పద్మథియేటర్ గేటు వద్ద రోడ్డు దాటుతున్న బాలుడిని ఢీకొట్టబోయే పరిస్థితి వచ్చింది. ఎందుకు అంతవేగంగా వెళుతున్నావని ఫరంపేటకు చెందిన దున్న విద్యాసాగర్ షఫీని ప్రశ్నించాడు. దీంతో వీరి మధ్య వాగ్వివాదం జరిగింది. ఈనేపథ్యంలో షఫీ విద్యాసాగర్‌పై బీరు సీసాతో దాడి చేశాడు. ఏఎస్ఐ నందికి కృపావరం ఆధ్వర్యంలో పోలీసులు అక్కడకు చేరుకుని గాయపడ్డ సాగర్‌ను ఆసుపత్రి తరలించారు. షఫీని అరెస్టుచేసి కోర్టులో హాజరుపర్చగా ఆదివారం రిమాండ్‌కు తరలించారు.

నేడు ముత్యాలమ్మ జాతర



అంబాజీపేట, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): నందంపూడి గ్రామదేవత శ్రీ ముత్యాలమ్మ తల్లి జాతరను సోమవారం రాత్రి నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. మంగళవారం అమ్మవారి తీర్థం, ఈనెల 17న జలకం నిర్వహిస్తామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఉత్సవాలకు సంబంధించి ఏర్పాట్లు చేసినట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

మిత్రుడి కుటుంబానికి రూ.లక్ష సహాయం

ఉప్పలగుప్తం, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): వారంతా కలిసి గొల్లవిల్లి ఉన్నత పాఠశాలలో 1997-98లో టెన్త్ చదువుకున్నారు. ఇటీవల వారిలో వాడపర్రుకు చెందిన అరవ వీరవెంకటరమణసత్యనారాయణ అకాల మృతి చెందాడు. అతడికి భార్య, కుమారుడు, కుమార్తెతో పాటు వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులు ఉన్నారు. టెన్త్ స్నేహితులు ఆదివారం రూ.లక్ష మిత్రుని కుటుంబ సభ్యులకు అందించారు. కార్యక్రమంలో కోడూరి పళ్ళంరాజు, నాగిరెడ్డి రాంబాబు, మారిశెట్టి నాగకృష్ణమూర్తి, సలాది తాతారావు, గనిశెట్టి చిరంజీవి, ఆదివారపుపేట చిన్నారావు, బొంతు చిట్టిబాబు, పాలకొల్లు సుబ్రహ్మణ్యం, బిక్కిన ఏసుబాబు, గుత్తుల రాజు, మారిశెట్టి దుర్గారావు, చిప్పడా ప్రసన్న, జిన్నూరి నాగబాబు పాల్గొన్నారు.

17న ఏఎంసీ పాలకవర్గం ప్రమాణస్వీకారం

అంబాజీపేట, ఆగస్టు10(ఆంధ్రజ్యోతి): ఈనెల17 చేపట్టే అంబాజీపేట వ్యవసాయ మార్కెట్ పాలకవర్గ సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నీటిపారుదల శాఖ డైరెక్టర్ శిరిగినీడి వెంకటేశ్వరరావు కోరారు. అంబాజీపేటలో ఆదివారం సమావేశం నిర్వహించారు. అంబాజీపేట మార్కెట్ కమిటీ ఛైర్మన్‌గా చిట్టూరి శ్రీనివాస్, వైస్‌ఛైర్మన్‌గా కొర్లపాటి వెంకటేశ్వరరావు, పలువురు డైరెక్టర్లు నియమితులయ్యారని తెలిపారు. 17నఉదయం అంబాజీపేట కొర్లపాటివారిపాలెం శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయం నుంచి ర్యాలీ ప్రారంభించి మార్కెట్‌యార్డుకు చేరుకుంటారన్నారు. దొమ్మేటి సాయికృష్ణ, కొర్లపాటి గోపి, అరిగెల సూరిబాబు, అల్లాడ రవి, దిగుమర్తి చిట్టిబాబు, పితాని రామకృష్ణ, వాకపల్లి దొరబాబు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి విరాళాలు

మామిడికుదురు, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): అప్పనపల్లి బాలబాలాజీ స్వామి నిత్యాన్నదాన పథకానికి కొత్తపేటకు చెందిన మల్లవరపు వెంకట సత్యనారాయణ-సత్యవతి దంపతులు రూ.10వేలు విరాళంగా అందించారు. విశాఖపట్నానికి చెందిన బడే నాగసురేష్-శాంతిప్రియ దంపతులు రూ.10,116 విరాళంగా అందించారు. నిడదవోలుకు చెందిన కాప రామకృష్ణ-విజయలక్ష్మి దంపతులు రూ.10వేలను విరాళంగా అందించారు. విరాళాలు అందించిన భక్తులకు అర్చకులు వేదాశీర్వచనం ఇచ్చి శేషవస్త్రంతో సత్కరించి స్వామివారి చిత్రపటం, ప్రసాదం అందించి అభినందించారు.

రేపు భవిత కేంద్రంలో శిబిరం

రాజోలు, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): రాజోలు భవిత కేంద్రంలోఈనెల12న ప్రత్యేక అవసరాలు గల విద్యార్థుల అసైన్‌మెంట్ క్యాంపును నిర్వహిస్తున్నట్టు సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్టు అధికారి జి.మమ్మీ తెలిపారు. రాజోలులో ఆదివారం ఆమె విలేకరులతో మాట్లాడారు. రాజోలు, మలికిపురం, సఖినేటిపల్లి మండలాలకు చెందిన ప్రత్యేక అవసరాలు గల పిల్లల కోసం ఈఅసైన్‌మెంట్ క్యాంప్ నిర్వహిస్తున్నామన్నారు. ఈక్యాంపులో ప్రత్యేక అవసరాలు గల పిల్లలను పరీక్షించి వారికి ఉపకరణాలు అందజేస్తామన్నారు.

సంకీర్తన భవనం ప్రారంభం


జనుపల్లిలో సంకీర్తన భవనాన్ని ప్రారంభించి పూజలు నిర్వహిస్తున్న సత్యగోపీనాథ్‌దాస్

అమలాపురం రూరల్, ఆగస్టు 10(ఆంధ్ర జ్యోతి): అంతర్జాతీయ కృష్ణ చైతన్యసంఘం (ఇస్కాన్) ఆధ్వర్యంలో జనుపల్లిలో నూతనంగా నిర్మించిన నితాయిగౌరంగ సంకీర్తన భవనాన్ని ఆదివారం రాజమహేంద్రవరం ఇస్కాన్ మందిర్ ఛైర్మన్ సత్యగోపీనాథ్‌దాస్ ప్రారంభించారు. తొలుత అమలాపురం గడియార స్తంభం సెంటర్ నుంచి కృష్ణ భక్తుడు నామ సంకీర్తన చేసుకుంటూ జనుపల్లి చేరుకున్నారు. శ్రీకృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకుని వివిధ పాఠశాలల విద్యార్థులకు పోటీలు నిర్వహించగా విజేతలకు గోపీనాథ్‌దాస్ బహుమతులు అందజేశారు. నితాయి, గౌరచంద్రులకు మహాపుష్పాభిషేకం నిర్వహించి 54రకాల మహా నైవేద్యాన్ని సమర్పించి ఆయన పూజలు నిర్వహించారు. ఈనెల16న శ్రీకృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకుని ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు ఇస్కాన్ అమలాపురం మేనేజర్ శివానంద నిమాయిదాస్ పేర్కొన్నారు. కార్యక్రమంలో వాకపల్లి నాయుడు సత్యకళ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీటీసీకి పరామర్శ

మామిడికుదురు, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): భార్య వియోగంతో బాధపడుతున్న లూటకుర్రు ఎంపీటీసీ నామన వెంకటేశ్వరరావును ఆదివారం పలువురు ఎంపీటీసీలు పరామర్శించారు. ఎంపీటీసీ భార్య పద్మ చిత్రపటం వద్ద పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించారు. పరామర్శించిన వారిలో వర్ధినేని మురళీకృష్ణ, నూరేన్ అబ్బాస్, నయినాల సత్యంమూర్తి, కడలి నూకరాజు తదితరులు ఉన్నారు.

మంత్రి సుభాష్ ఆర్థిక సాయం

అంబాజీపేట, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): చిరతపూడి గ్రామ పరిధిలోని చినపాలేనికి చెందిన పితాని రమేష్ కొంత కాలంగా క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్నాడు. ఈవిషయాన్ని ఎస్ఏఎఫ్ సభ్యులు మంత్రి వాసంశెట్టి సుభాష్‌కు వివరించారు. మంత్రి సుభాష్ స్పందించి వైద్య ఖర్చుల కోసం రూ.20వేలు ఎస్ఏఎఫ్ సభ్యులకు అందించారు. ఎస్ఏఎఫ్ సభ్యులు రూ.10వేలు సమకూర్చి రూ.30వేలను ఆదివారం రమేష్‌కు అందించారు. కార్యక్రమంలో దొంగ శ్రీను, సంసాని బాలాజీ, చిట్టూరి శ్రీనివాస్, గుత్తుల రాము, కాండ్రేగుల రాము తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి విద్యుత్ సరఫరాకు అంతరాయం

అమలాపురం రూరల్, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): అమలాపురం పట్టణంలో నూతన టవర్ల నిర్మాణం అనంతరం కొత్తలైన్ ఏర్పాటుచేసేందుకు ఈనెల 12,13,14 తేదీల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె.రాంబాబు తెలిపారు. ఆ మూడు రోజులు ఉదయం 7నుంచి 2గంటల వరకు 11కేవీ ముమ్మిడివరం గేటు ఫీడరుమీద ఉన్న అన్ని ఏరియాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. ప్రధానంగా ఈదరపల్లి నుంచి ముమ్మిడివరం గేటుసెంటర్ వరకు మెయిన్‌రోడ్డు, సీతాపతిరావుపేట, మున్సిపల్‌కాలనీ, కూరగాయల మార్కెట్, దేవాంగుల వీధి, సర్క్యులర్ బజార్‌ప్రాంతాల్లో సరఫరా ఉండదన్నారు.

రికార్డులులేని 20 వాహనాలు స్వాధీనం

అంబాజీపేట, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): మాచవరం పరిధిలోని హడ్కోకాలనీలో ఆదివారం తెల్లవారుజామున పోలీసులు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఎస్పీ బి.కృష్ణారావు ఆదేశాలతో కొత్తపేట డీఎస్పీ సుంకర మురళీమోహన్ పర్యవేక్షణలో పి.గన్నవరం సీఐ రుద్రరాజు భీమరాజు ఆధ్వర్యంలో 25మంది సిబ్బందితో ముమ్మర తనిఖీలు చేపట్టారు. రికార్డులు లేని 20 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. సరైన పత్రాలు చూపిస్తే వాహనాలు తిరిగి ఇస్తామని, లేకుంటే ఈవాహనాలను ఆర్టీవో కార్యాలయానికి అప్పగిస్తామని సీఐ తెలిపారు. మారుముల గ్రామాల్లో నాటుసారా, గంజాయి వంటి అసాంఘిక కార్యక్రమాలను నివారించేందుకు ఇటువంటి ఆకస్మిక తనిఖీలు తరుచూ కొనసాగిస్తామని సీఐ హెచ్చరించారు. ఎస్ఐ కె.చిరంజీవి, శిక్షణ ఎస్ఐ జి.సోమేంద్ర, ఏఎస్‌లు, హెచ్‌సీలు, కానిస్టేబుల్స్ పాల్గొన్నారు.

మట్టి మాఫియా నిర్వాకం.. నూతన రహదారి ధ్వంసం

ఉప్పలగుప్తం, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): ఉప్పలగుప్తం పంచాయతీ పేరాయిచెరువలో ఇటీవల నూతనంగా బీటీ రహదారి నిర్మించారు. ఈరహదారికి ఇంకా బిల్లులు కాలేదని కాంట్రాక్టరు వాపోతున్నారు. అయితే ఈరహదారిపై మట్టి మాఫియా యథేచ్ఛగా మట్టి రవాణా సాగించడంతో రోడ్డుపై మట్టి పేరుకుపోయి వాహనాల రాకపోకలకు అంతరాయం కల్గడంతో స్థానికులు మట్టి రవాణాను అడ్డుకున్నారు. ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామనడంతో రోడ్డుపై మట్టిని ట్రాక్టర్ బ్లేడ్లతో తొలగించారు. దీనితో రోడ్డు మొత్తం ధ్వంసమైనట్టు స్థానికులు అధికారులకు ఫిర్యాదు చేశారు.

అక్రమ రిజిస్ట్రేషన్‌పై ఫిర్యాదు

ముమ్మిడివరం, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): వారసత్వంగా లభించిన ఆస్తిని కొందరు వ్యక్తులు దస్తావేజు లేఖరు సాయంతో కుట్ర పూరితంగా, మోసపూరితంగా తమ ఆస్తిని కాజేయాలనే దురుద్దేశంతో రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని లంకాఫ్‌ఠాణేలంకకు చెందిన కొప్పిశెట్టి వేణుగోపాలకృష్ణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. లంకాఫ్‌ఠాణేలంకలో 98సెంట్ల భూమి తమకు వారసత్వంగా లభించిందని, దానిని తాను, తన సోదరుడు విశ్వేశ్వరరావు పారీకత్తులు (పార్టీషన్) రాయించుకున్నామని అయితే తమకు ఆస్తికి సంబంధించి అన్ని ఆధారాలు ఉన్నాయని, ఆ గ్రామానికి చెందిన ఆరుగురు వ్యక్తులు కాజేయాలనే దురుద్దేశంతో ముమ్మిడివరం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని, దీనిపై విచారణ నిర్వహించి చర్యలు తీసుకోవాలని వేణుగోపాలకృష్ణ ఫిర్యాదు చేశాడు. ఎస్ఐ డి.జ్వాలాసాగర్ కేసు దర్యాప్తు చేపట్టారు.

బహిరంగ ప్రాంతాల్లో మద్యం సేవిస్తే చర్యలు తీసుకోవాలి

యానాం, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): యానాంలో బహిరంగంగా మద్యం సేవించే వారిపై చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ పోలీసులకు సూచించారు. మద్యం దుకాణాల ఎదురుగా మద్యం సేవించి వారిపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు అక్కడ జరిగే సంఘటనలకు పూర్తి బాధ్యత ఆ దుకాణం యాజమాన్యం వహించాల్సి వస్తుందన్నారు.

పద్మావతి అమ్మవారికి హారం బహూకరణ

మామిడికుదురు, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): అప్పనపల్లి బాలబాలాజీ సన్నిధిలో వేంచేసి ఉన్న శ్రీపద్మావతి అమ్మవారికి భక్తులు మామిడిపిందెల హారం సమర్పించారు. అప్పనపల్లి గ్రామానికి చెందిన తటవర్తి లక్ష్మీనారాయణ, వారి కుటుంబ సభ్యులు హారాన్ని అందించారు. ఆదివారం స్వామివారిని 2800మంది భక్తులు దర్శించుకుని, 1200మంది అన్నప్రసాదం స్వీకరించారని, వివిధ ఆర్జిత సేవల ద్వారా రూ.1,75,997 ఆదాయం వచ్చింది.

శాంతి భద్రతల పరిరక్షణకే కార్డన్ సెర్చ్

రాయవరం, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): శాంతి, భద్రతలను పరిరక్షించేందుకు గ్రామాల్లో కార్డన్ సెర్చ్ నిర్వహిస్తున్నామని ట్రైనీ డీఎస్పీ ప్రదీప్తి అన్నారు. ఆదివారం చెల్లూరు శివారు చింతల తోటలో పోలీసులు కార్డన్ సెర్చ్‌పై ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ట్రైనీ డీఎస్పీ మాట్లాడుతూ గ్రామాల్లో ఎవరైనా అపరిచితులు అనుమానాస్పదంగా తిరుగుతుంటే స్థానికులు పోలీసులకు సమాచారం అందించాలన్నారు. గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలకు తావివ్వకుండా ప్రజలు అవగాహనతో ఉండాలన్నారు. పక్షులను వేటాడేందుకు, చెరువుల దగ్గర పక్షులు రాకుండా శబ్దం చేసేందుకు నాటు తుపాకీలతో ఎవరైనా సంచరిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. పత్రాలు లేని వాహనాలకు చలనాలు విధిస్తామన్నారు. కార్యక్రమంలో మండపేట రూరల్ సీఐ పి.దొరరాజు, ఎస్ఐ డి.సురేష్ బాబు, అంగర ఎస్ఐ హరీష్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.


ప్రజలకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

బీజేపీ నాయకుల తిరంగా ర్యాలీ


రాయవరంలో తిరంగా ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

రాయవరం, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): రాయవరం గ్రామంలో బీజేపీ నాయకుల ఆధ్వ ర్యంలో ఆదివారం తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ మండలాధ్యక్షుడు శాకా దుర్గా శ్రీనివాస్ మాట్లాడుతూ హర్‌ఘర్ తిరంగా కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించాలని, మండలంలోని ప్రతి ఒక్కరూ తమ ఇళ్లపై జాతీయ జెండాను ఎగురవేయాలన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ పిలుపు మేరకు తిరంగా ర్యాలీ నిర్వహించినట్లు చెప్పారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు చాట్రాతి జానకి రాంబాబు, కోన సత్యనారాయణ, చిరట్ల సుబ్బారావు, నరాల రాంబాబు, చింతా తమ్మిరెడ్డి, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, ఈరెళ్ల కృష్ణమూర్తి, శాకా ధనుంజయ, అబ్బిరెడ్డి శాంత రావు, నిమ్మకాయల బ్రహ్మాజీరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు హర్‌ఘర్ తిరంగా ర్యాలీ

కె.గంగవరం, (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం మండల కేంద్రంలో హర్‌ఘర్ తిరంగా ర్యాలీ ఏర్పాటు చేసినట్టు తహశీల్దార్ శ్రీరామ్‌ప్రసాద్ తెలిపారు. దీనికి మండల స్థాయి అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, సచివాలయ సిబ్బంది, విద్యార్థులు హాజరు కావాలని ఆయన ఒక ప్రకటనలో కోరారు.

పెంటాలమ్మ అమ్మవారికి పలువురు విరాళాలు అందజేత

ఆత్రేయపురం, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): నార్కెడిమిల్లి గ్రామదేవత పెంటాలమ్మ అమ్మవారి ఆలయ ప్రాంగణంలో నిర్మిస్తున్న అన్న దాన భవన నిర్మాణానికి పూర్వపు గ్రామస్తులు విరాళాలు అందిస్తున్నారు. బెంగళూరులో ఉం టున్న తురగ రాజేంద్రప్రసాద్ రూ.1,01,116, హైదరాబాద్‌లో ఉంటున్న విశ్రాంత డీజీపీ ఏవీ సుబ్బారావు రూ.50,116, పాలం శ్రీను రూ.50,116, దేవిశెట్టి బ్రహ్మాజీ రూ.50,116 విరాళాలను మాజీ సర్పంచ్ మద్దింశెట్టి వీరవెంకట సత్యనారాయణ, కమిటీ సభ్యులకు వారు అందించారు


నార్కెడిమిల్లి పెంటాలమ్మ ఆలయం వద్ద అన్నదాన భవన నిర్మాణానికి విరాళం ఇస్తున్న దృశ్యం

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం


టీడీపీ కార్యాలయం వద్ద చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న సంజీవ్, పార్టీ శ్రేణులు

రావులపాలెం, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం బీసీలకు లిక్కర్ షాపులు, బార్లలో పది శాతం రిజర్వేషన్లు అమలు చేసేందుకు నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో సీఎం చంద్రబాబు చిత్రపటానికి పార్టీ శ్రేణులు పాలాభిషేకం చేశారు. రావులపాలెం క్యాంపు పార్టీ కార్యాలయం వద్ద మండల శాఖ అధ్యక్షుడు కొప్పిశెట్టి ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో యువ నాయకులు బండారు సంజీవ్, శెట్టిబలిజ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ కేతపల్లి శ్రీనివాస్, గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ మిద్దే ఆదినారాయణతో పాటు పార్టీ శ్రేణులు చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశా రు. ఈ సందర్భంగా వారు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు గుత్తుల పట్టాభి రామారావు, కాసా విజయసాగర్ తదితరులతో పాటు, బీసీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గాన్ని తూర్పులో విలీనానికి కృషి చేయాలి

రాయవరం, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): మండపేట నియోజకవర్గాన్ని తూర్పుగోదావరి జిల్లాలో కలిపేలా రాజకీయాలకు అతీతంగా సమష్టిగా కృషి చేయాలని జేఏసీ నేత కామన ప్రభాకరరావు అన్నారు. ఆదివారం రాయవరం వేంకటేశ్వరస్వామి కల్యాణ మండపంలో మండల జేఏసీ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వక్తలు మాట్లాడుతూ మండపేట నియోజకవర్గం కోనసీమ జిల్లాలో ఉండటం వల్ల వివిధ పనుల నిమిత్తం వెళ్లేందుకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రజల సౌలభ్యం కోసం మండపేట నియోజకవర్గాన్ని తూర్పు గోదావరిలో కలపాలని జేఏసీ నేతలు తీర్మానించారు. మండలంలోని అన్ని పంచాయతీలు దీనికి అనుకూలంగా తీర్మానం చేసేలా కృషి చేయాలని తీర్మానించారు. కార్యక్రమంలో జేఏసీ నేతలు దూళి జయరాజు, కోన సత్యనారాయణ, చాట్రాతి జానకి రాంబాబు, ఉండవిల్లి రాంబాబు, సీఐటీయూ మండల కన్వీనర్ డి.ఆదిలక్ష్మి, వెదురుపాక సహకార సంఘం అధ్యక్షుడు పి.గణేష్ తదితరులతో పాటు పలువురు పాల్గొన్నారు.

అంగరలో...

కపిలేశ్వరపురం, (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంగరలో ఆదివారం నియోజకవర్గ అఖిల పక్షనేతలతో సమావేశం నిర్వహించారు. మండపేట నియోజకవర్గ అఖిలపక్ష కమిటీ చైర్మన్ కామన ప్రభాకరరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జడ్పీటీసీ పుట్టపూడి అబ్బు, పుత్సల శ్రీనివాస్, సర్పంచ్ సాకా శ్రీనివాస్, జె. మల్లిఖార్జునుడు తదితరులు పాల్గొన్నారు. ఇప్పటికే మండపేట నియోజకవర్గాన్ని తూర్పుగోదావరి జిల్లాలో కలపాలని కోరుతూ మండలంలోని మెజార్టీ గ్రామ పంచాయతీలు తీర్మానాలు చేసినట్లు తెలిపారు. అమలాపురం కంటే రాజమహేంద్రవరం అయితే విధాలా అనుకూలంగా ఉంటుందని అఖిలపక్ష నేతలు అభిప్రాయాలను వ్యక్తం చేశారు.


రాయవరంలో జేఏసీ సమావేశంలో మాట్లాడుతున్న కామన

నిత్యావసర వస్తువుల పంపిణీ

కొత్తపేట, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): బిళ్లకుర్రు గ్రామానికి చెందిన లవ్ అండ్ హోప్ ఫౌండేషన్ చైర్మన్ నెల్లి నానిబాబు ఆధ్వర్యంలో ఆదివారం వితంతువులు, అనాథ పిల్లలకు నిత్యావసర వస్తువులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయా కుటుంబాలకు ఫౌండేషన్ ద్వారా సాయం అందిస్తున్నామన్నారు. దాతలు ఎవ్వరైనా ముందుకు వస్తే వారికి అందజేసే సాయాన్ని మరింత పెంచుతామన్నారు. కార్యక్రమంలో బిళ్లకుర్రు సర్పంచ్ నెల్లి లక్ష్మీపతి తదితరులు పాల్గొన్నారు.


నిత్యావసర వస్తువులను పంపిణీ చేస్తున్న లవ్ అండ్ హోప్ ఫౌండేషన్


గాజుల అలంకరణలో వెదురుపాక సత్తెమ్మ అమ్మవారు

సత్తెమ్మ అమ్మవారికి గాజుల అలంకరణ

రాయవరం, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెదురుపాక-ఆరికరేవుల రోడ్డులో ఉన్న కొర్లవారి సత్తెమ్మ అమ్మవారికి శ్రావణ మాసం ఆదివారాన్ని పురస్కరించుకుని గాజులతో ప్రత్యేకంగా అలంకరించారు. పసలపూడి గ్రామానికి చెందిన బంగారు శివ, ఆయన కుటుంబ సభ్యుల వితరణతో అమ్మవారికి గాజులు సమర్పించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకుడు మాచవరపు వెంకట సురేష్, బర్ల షణ్ముక సూర్య తదితరులు పాల్గొన్నారు.

రేపు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉచిత వైద్య శిబిరం

మండపేట, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): మండపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 12న ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కేటీటీవీ శ్రీనివాసరావు తెలిపారు. రాజమండ్రికి చెందిన శ్రీకర మల్టీస్పెషాల్టీ, గౌతమి నేత్రాలయం, రమా దంత వైద్యశాల వారితో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశామని ఆయన తెలిపారు. మంగళవారం తమ కళాశాల ప్రాంగణంలో జరిగే ఉచిత వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన ఆ ప్రకటనలో కోరారు. వివరాలకు 96420 12265, 7993953701లో సంప్రదించాలని ఆయన కోరారు.


జొన్నాడలో రికార్డులు లేని వాహనాలను స్వాధీనం చేసుకున్న పోలీసులు

జొన్నాడలో కార్డన్ సెర్చ్

4 కార్లు, 24 బైక్‌లు స్వాధీనం

ఆలమూరు, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): కార్డన్ సెర్చ్‌లో భాగంగా జొన్నాడలో తనిఖీలు చేసి రికార్డులు సక్రమంగా లేని వాహనాలను ఆలమూరు పోలీసులు సీజ్ చేశారు. ఆలమూరు ఎస్ఐ జి.నరేష్, ఆత్రేయపురం ఎస్ఐ రాము ఆధ్వర్యంలో పోలీసులు జొన్నాడ తారకరామ కాలనీలో దాడి చేశారు. రికార్డులు సక్రమంగాలేని 4 కార్లు, 24 ద్విచక్ర వాహనాలను సీజ్ చేశారు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు డ్రోన్ కెమెరాలను ఉపయోగించి ఈ దాడి చేసి వాహనాలను పట్టుకున్నామని ఎస్ఐ నరేష్ తెలిపారు. వాహనాల రికార్డులు సక్రమంగా ఉన్నట్టు రికార్డులు చూపిస్తే వాటిని రిలీజ్ చేస్తామన్నారు. ఏఎస్ఐ సూర్యచంద్రరావుతోపాటు పలు స్టేషన్ల సిబ్బంది పాల్గొన్నారు.

సంకీర్తన భవనం ప్రారంభం

అమలాపురం రూరల్, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ కృష్ణ చైతన్య సంఘం (ఇస్కాన్) ఆధ్వర్యంలో జనుపల్లిలో నూతనంగా నిర్మించిన నితాయిగౌరంగ సంకీర్తన భవనాన్ని ఆదివారం రాజమహేంద్రవరం ఇస్కాన్ మందిర్ చైర్మన్ సత్యగోపీనాథ్‌దాస్ ప్రారంభించారు. తొలుత అమలాపురం గడియార స్తంభం సెంటర్ నుంచి కృష్ణ భక్తులు నామ సంకీర్తన చేసుకుంటూ జనుపల్లి చేరుకున్నారు. శ్రీకృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకుని వివిధ పాఠశాలల విద్యార్థులకు పోటీలు నిర్వహించగా విజేతలకు గోపీనాథ్‌దాస్ బహుమతులు అందజేశారు. నితాయి, గౌరచంద్రులకు మహా పుష్పాభిషేకం నిర్వహించి 54 రకాల మహా నైవేద్యాన్ని సమర్పించి ఆయన పూజలు నిర్వహించారు. ఈనెల 16న శ్రీకృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకుని ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు ఇస్కాన్ అమలాపురం మేనేజర్ శివానంద నిమాయి దాస్ పేర్కొన్నారు. కార్యక్రమంలో వాకపల్లి నాయుడు, సత్యకళ తదితరులు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి విరాళాలు

మామిడికుదురు, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): అప్పనపల్లి బాలబాలాజీ నిత్యాన్నదాన పథకానికి కొత్తపేటకు చెందిన ఎం.వెంకట సత్యనారాయణ, సత్యవతి దంపతులు రూ.10వేలు విరాళం అందించారు. నిడదవోలుకు చెందిన కె.రామకృష్ణ, విజయలక్ష్మి దంపతులు రూ.10వేలను విరాళంగా ఇచ్చారు. దాతలను ఆలయ సిబ్బంది సత్కరించారు.

మొక్కలు వచ్చేస్తున్నా పట్టించుకోరా?

• శిథిలావస్థకు చేరుకున్న కోట వంతెన • నిర్లక్ష్యంగా వదిలేసిన వైసీపీ ప్రభుత్వం • గత టీడీపీ హయాంలోనే శంకుస్థాపన • ఇప్పుడైనా నిర్మించాలని ప్రజల వినతి

కె.గంగవరం, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వం అభివృద్ధిని పూర్తిగా నిర్లక్ష్యం చేసిందనడానికి ఇది ఒక నిదర్శనం. మండలంలోని కోట గ్రామంలో బ్యాంక్ కెనాల్‌పై ఉన్న వంతెన శిథిలావస్థకు చేరుకుంది. కోట గ్రామం నుంచి ప్రజలు బయటకు రావాలన్నా, బయటవారు కోట గ్రామానికి చేరుకోవాలన్నా ఈ వంతెన దాటి వెళ్లాల్సిందే. ఇంతటి ప్రాధాన్యత ఉన్న ఈ వంతెన నిర్మించి చాలా సంవత్సరాలు అయ్యింది. ప్రస్తుతం ఈ వంతెన కింద భాగంలో స్లాబ్ పెచ్చులూడిపోయి రోజు రోజుకు శిథిలస్థితికి చేరుకుంటోందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. రెయిలింగ్‌కు ఇరువైపులా పిచ్చిమొక్కలు పెరిగిపోతూ ఎప్పుడు కూలిపోతుందోనని కోట ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

గత టీడీపీ ప్రభుత్వంలోనే భూమిపూజ: వంతెన అధ్వాన్నస్థితిని గత టీడీపీ ప్రభుత్వ హయాంలో స్థానికులు అధికారులు, ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో అప్పటి ఎమ్మెల్యే తోట త్రిమూర్తులు రూ.70 లక్షలు మంజూరు చేయించారు. అప్పట్లో భూమిపూజ చేసి శిలాఫలకాన్ని కూడా ఆవిష్కరించారు. ఆ తర్వాత జరిగిన ఎన్నికల్లో ప్రభుత్వం మారడం తో వాటి పనులు నిలిచిపోయాయి. వైసీపీ ప్రభుత్వం ఈ వంతెన నిర్మాణంపై ఎలాంటి శ్రద్ధ పెట్టలేదు. ఇప్పుడు ఈ వంతెన దుస్థితి మరింత ప్రమాదంగా మారింది. దీనికి తోడు కె.గంగవరం-కోటిపల్లి ప్రధాన రహదారి నుంచి కోట వెళ్లాలంటే రహదారి అధ్వానంగా ఉం డేది. ప్రజల అభ్యర్థనతో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ రహదారి నిర్మాణానికి నిధులు మంజూరు చేయించారు. రహదారి నిర్మాణం చేశారు. వంతెన నిర్మాణం కూడా చేయాలని స్థానికులు, వాహనదారులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.


శిథిలావస్థకు చేరుకున్న వంతెన



ఆత్రేయపురం మండల పరిషత్ వద్ద యూటీఎఫ్ ఆవిర్భావ వేడుకల దృశ్యం. పక్క చిత్రంలో ఆలమూరులో యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవంలో పాల్గొన్న ఉపాధ్యాయులు


మండపేటలో యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవాన్ని జరుపుకుంటున్న దృశ్యం

ఘనంగా యూటీఎఫ్ ఆవిర్భావ వేడుకలు

ఆత్రేయపురం, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): ఆత్రేయపురం మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఆదివారం 52వ యూటీఎఫ్ ఆవిర్భావ వేడుకలను నిర్వహించారు. యూటీఎఫ్ ఆడిట్ కమిటీ జిల్లా కన్వీనర్ కొప్పిశెట్టి శ్రీనివాస్ పతాకావిష్కరణ చేశారు. కార్యక్రమంలో మండల శాఖ అధ్యక్షులు రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి సుధాకర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఆలమూరు (ఆంధ్రజ్యోతి): యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆలమూరులో నిర్వహించారు. యూటీఎఫ్ మండల శాఖ ఆధ్వర్యంలో కార్యాలయం వద్ద జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ మండల శాఖ అధ్యక్షుడు అద్దరి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి బొంతు లోకేష్, నాయకులు వైవీవీ రమణ, పీవీవీఎస్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

మండపేట, (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ సమస్యలపై రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) సంఘం నిరంతర పోరాటం చేస్తుందని యూటీఎఫ్ రాష్ట్ర సంఘ కౌన్సిలర్ కొవ్వూరి గోపాలకృష్ణారెడ్డి అన్నారు. యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆదివారం పట్టణంలో ఘనంగా జరిపారు. సంఘ సీనియర్ నాయకుడు జె.విశ్వాస్ కుమార్, సీహెచ్ శ్రీహరి రావు యూటీఎఫ్ పతాకాన్ని ఎగుర వేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ ఉపాధ్యాయ సంఘ నాయకులు పి.రామ చంద్రారెడ్డి, బి.రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

కపిలేశ్వరపురం, (ఆంధ్రజ్యోతి): మండల ప్రజా పరిషత్ కార్యాలయం ఎదుట ఆదివారం యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవాన్ని జరిపారు. కార్యక్రమంలో రిటైర్డ్ టీచర్లు డీవీ రాఘవులు, సీహెచ్‌వీవీ సత్యనారాయణ మూర్తి, కేవీ రమణ, మండల అధ్యక్షుడు జె.శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి ఐ.సూరిబాబు తదితరులు పాల్గొన్నారు. యూటీఎఫ్ యూనియన్ నాయకులు ఆవిర్భావ శుభాకాంక్షలు తెలిపారు.


కపిలేశ్వరపురంలో యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవంలో మాట్లాడుతున్న నాయకులు


శిథిలావస్థకు చేరిన గొల్లపుంత కాలనీ సమీపంలో వున్న గొడ్డుకాల్వ

శిథిలస్థితికి చేరుకుంటున్న వంతెన

భయాందోళనలో ప్రయాణికులు

మండపేట, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): గొల్లపుంత కాలనీకి సమీపంలో వున్న గొడ్డుకాల్వ(వల్లూరు) డ్రైన్‌పై వున్న వంతెన శిథిలావస్థకు చేరి కూలేందుకు సిద్ధంగా ఉంది. ప్రతిరోజూ రైతులు, ప్రజలు ఈ వంతెన గుండా రాకపోకలు సాగిస్తున్నారు. కొన్నేళ్ల క్రితం నిర్మించిన ఈ వంతెన బీటలు వారి శిథిలావస్థకు చేరి ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి నెలకొందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ వంతెనకు సమీపంలో చమురు సంస్థ కార్యకలాపాలు చేపట్టింది. దీంతో ఆ సంస్థ వాహనాల రాకపోకలతో ఈ వంతెన ఛిద్రమైందని స్థానికులు ఆరోపిస్తున్నారు. గొల్లపుంతకాలనీలో సుమారు 40 వేల వరకు నివసిస్తున్నారని వారంటున్నారు. టిడ్కో గృహాలతోపాటు ఇండివిడ్యువల్ గృహాలు కూడా ఉన్నాయని వారంటున్నారు. సుమారు 8వేల గృహాల వరకు టిడ్కోతో కలుపుకుని ఉండవచ్చని స్థానికులు అంచనా వేస్తున్నారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని శిథిలావస్థకు చేరిన ఈ వంతెనను పునర్నిర్మించాలని రైతులు, వాహనదారులు, ఆయా ప్రాంత కాలనీవాసులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు.

పాఠశాలకు పూర్వ విద్యార్థి డ్రమ్స్ బహూకరణ

రాయవరం, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): రాయవరం శ్రీరామయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు పూర్వ విద్యార్థి వితరణతో ఆదివారం డ్రమ్స్ బహూకరించారు. పాఠశాలలో స్కౌట్ అండ్ గైడ్స్ కార్యక్రమం నిర్వహించేందుకు గాను పాఠశాల 1987-92 బ్యాచ్ పూర్వ విద్యార్థి అనపర్తి మండలం మహేంద్రవాడ గ్రామానికి చెందిన కె.సత్యనారాయణరెడ్డి(సతీష్) వితరణతో వాటిని అందజేశారు. పాఠశాలకు డ్రమ్స్ అందజేసిన ఆయన్ను హెచ్ఎం శాంతి సునీత, పలువురు ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు తదితరులు అభినందించారు.


రాయవరం హైస్కూల్‌కు డ్రమ్స్ బహూకరిస్తున్న దృశ్యం

మేరీ పంచాయత్ యాప్‌తో గ్రామాల సమగ్ర సమాచారం

మండపేట, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నో నిధులను విడుదల చేస్తున్నాయి. ప్రజా సంక్షేమానికి సంబంధించిన పథకాలు, కార్యక్రమాలు చేపడుతున్నాయి. కానీ తమ గ్రామానికి ఎన్ని నిధులు విడుదలయ్యాయి, ఎలాంటి పథకాలు అమలవుతున్నాయి అనే సమాచారం ప్రజలకు తెలియడం లేదు. ప్రజలకు వీటి సమాచారాన్ని చేరువ అయ్యేలా కేంద్ర ప్రభుత్వం మేరీ పంచాయత యాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది.

జవాబుదారీతనం పెంచేందుకు: పంచాయతీరాజ్ వ్యవస్థలో జవాబుదారీతనం పెంచి ప్రజల భాగస్వామ్యం ప్రోత్సహించాలనే ఉద్దేశంతో కేంద్రం దీన్ని రూపొందించింది. గ్రామ పంచాయతీల ఆదాయం, వ్యయాలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కేటాయిస్తున్న నిధులు ఎలా వ్యయం చేస్తున్నారు తదితర సమాచారం అందరు తెలుసుకునే అవకాశం కల్పించింది. ప్రణాళిక ప్రకారమే అభివృద్ధి పనులు జరుగుతున్నాయా? లేక వేరోచోట వాటి పనులు జరుగుతున్నాయా? తదితర అంశాలు యాప్‌లో జీపీఎస్ సిస్టం ద్వారా తెలుసుకోవచ్చు. అలాగే ఆయా పనులు ఏదశలో ఉన్నాయి? ఏ పనికి ఎంత వ్యయం చేశారో కూడా తెలిసిపోతుంది. గ్రామసభల నిర్వహణ, తీర్మానాలు సైతం నమోదు చేస్తారు. తప్పుడు నివేదికలు రూపొందించినట్టు గుర్తిస్తే తగిన ఆధారాలతో సహ ప్రశ్నించే వీలుంటుంది.

ఈ యాప్‌ను ఎలా డౌన్‌లోడ్ చేసుకోవాలి: ప్లే స్టోర్ నుంచి మేరి పంచాయత్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని మొబైల్ నెంబర్‌తో లాగిన్ అవ్వాలి, రాష్ట్రం, జిల్లా, మండలం ఎంపిక చేసుకున్న తర్వాత గ్రామ పంచాయతీల వివరాలు కనిపిస్తాయి. ఆ జాబితాలో గ్రామ పంచాయతీకి సంబంధించిన సమగ్ర సమాచారం వస్తుంది. ఆక్రమాలకు చోటు లేకుండా జిల్లా సమగ్ర సమాచారం ఈ యాప్‌లో ఉంటుంది. ఆయా నిధులు పారదర్శకంగా వ్యయంచేసేలా చూడటంతోపాటు అవినీతి, అక్రమాలకు ఆదిలోనే అడ్డుకట్ట వేసేందుకు ఈ యాప్ ఎంతో ఉపయోగపడుతుందని పలువురు సూచిస్తున్నారు.

మొదలెట్టారు...మధ్యలో వదిలేశారు

• 2009లో మండల ప్రజా పరిషత్ బిల్డింగ్ నిర్మాణానికి శంకుస్థాపన • మధ్యలో నిలిచిన భవనం పనులు • తుప్పల మధ్యలో అసంపూర్తి భవనం

కపిలేశ్వరపురం, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): కపిలేశ్వరపురంలో మండల ప్రజా పరిషత్ నూతన భవన నిర్మాణానికి 2009లో శంకుస్థాపన జరిపారు. అప్పటి ఆలమూరు ఎమ్మెల్యే డాక్టర్ బిక్కిన కృష్ణార్జునచౌదరి ఎంపీపీ గ్రాంటు రూ.55 లక్షలతో నిర్మించనున్న ఈ భవనానికి శంకుస్థాపన చేశారు. అప్పట్లో ఆయా పనులు ప్రారంభమై వింటర్ లెవెల్ వరకు చురుగ్గా కొనసాగాయి. అనంతరం భవన నిర్మాణం మధ్యలో నిలిచిపోయింది. అప్పటి నుంచి వాటి పనులు పూర్తిచేయక వదిలేయడంతో ఈ భవనం చుట్టూ తుప్పలు, మొక్కలతో నిండిపోయింది. ప్రస్తుతం ఉన్న భవనం సరిపడకపోవడం, అక్కడక్కడ దెబ్బతినడం, పాత భవనం కావడంతో ఈ నూతన భవన నిర్మాణ పనులు చేపట్టారు. మధ్యలో ఆయా పనులు ఆగిపోవడంపై నేటికీ ఎవరికీ అర్థంకాని సమస్యగా మారింది. దీనిపై పలు రకాల విమర్శలు వెల్లు వస్తున్నాయి. ఏదైనా వాస్తు దోషం అయివుండవచ్చని కొందరు వ్యాఖ్యానిస్తున్నారు. ఇంత ఖర్చు చేసి నిర్మించిన భవనం పనులు ఇలా మధ్యలో ఆగిపోవడంపై ప్రజల సొమ్మును వృథా చేశారని పలువురు విమర్శిస్తున్నారు. ప్రభుత్వం స్పందించి వీటిని పూర్తి చేయాలన్నారు.


అసంపూర్తిగా దర్శనమిస్తున్న భవనం